స్థాపితము 1926 రిజిస్టర్ నెం. ఎ. 92

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి. ఎం.ఏ

సంపుటి 15 సంచిక: 41 | హైదరాబాద్ సోమవారం 12-2-1962 | 4 పేజీలు 7 నయాపైసలు

ఒకే వేదికపై నుండి భిన్న దృక్పథాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11

ఈ జనరల్ ఎన్నికలలో పోటీ చేస్తున్న వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు ఒకే వేదిక పైనుండి తమ తమ దృక్పథాలను వివరించారు. అఖిల భారత ఓటర్ల సంఘం ఇట్టి సమావేశాన్ని ఏర్పాటు చేసింది ప్రజలకు వారి ఓటు హక్కును సరిగా వినియోగించుకొనుటలో తోడ్పడటమే ఈ ఓటర్ల సంఘ లక్ష్యం. మన దేశంలో 75 శాతం ప్రజ నిరక్షరాస్యులు; వారికి ఓటు విలువ తెలియదు.

ఈ సంఘం ఏర్పరచిన సమావేశంలో కాంగ్రెస్, పి. ఎస్. పి., కమ్యూనిస్టు పార్టీ, జనసంఘం, స్వతంత్ర పార్టీ, అకాలీదళ ప్రతినిధులు ప్రసంగించారు.

మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం

భోపాల్, ఫిబ్రవరి 11

మధ్యప్రదేశ్‌లో ఈ తడవ ఎన్నికలందు వివిధ పార్టీలో చేస్తున్న ప్రచారంలో క్రొత్తదనం కానిపిస్తున్నది. ఆయా పార్టీల ఎన్నికల ప్రచారాలు కాక స్థానిక సమస్యలపై ఓటర్లను ఆకర్షించడానికి కృషి జరుగుతున్నది.

ఈ రాష్ట్రంలో పోలింగు వారం రోజుల్లో ప్రారంభమవుతుంది. 285 అసెంబ్లీ స్థానాలు 36 లోకసభ స్థానాలకు పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాన్ని ఉద్ధృత స్థాయిలో కొనసాగిస్తున్నారు. పోస్టర్ల అంటింపు నినాదాలు వ్రాయబడిన అట్టలతో ఊరేగింపులు సభలు సమావేశాలతో పెద్దరాజకీయ చైతన్యం కలిగిస్తున్నది

జనరల్ ఎన్నికల్లో తుదిమట్టం, 'పోలింగ్' ఏర్పాట్లకుమెరుగులు

అమెరికా సహాయతా ఒప్పందాల లక్ష్యం

సొంతంగా ఆరిక సౌష్ఠవాన్ని ఆయాదేశాలు సాధించుకోడంలో సాయపడాలన్న ఉద్దేశంతో పునఃపరిశీలన

(మా విలేఖరి)

హైదరాబాదు, ఫిబ్ర 11

అమెరికా సహాయంపొందే దేశాలు తమ స్వాతంత్ర్యాన్ని పటిష్ట పరుచుకొని సొంతఆర్థిక సౌష్ఠవాన్ని సాధించుకోడానికి సహాయపూతం కావడానికే కెన్నడీ పాలనలో నూతనసహాయతా వ్యవస్థ ఉద్దేశింపబడిందని కెన్నడీ ప్రత్యేక సలహాదారు ప్లెసింజర్ నిన్న విలేఖరుల గోష్ఠిలో తెలిపారు.

అయితే కొన్ని దేశాలకు ఆర్థికసహాయం, మరికొన్ని దేశాలకు సైనిక సహాయాలు అందజేస్తూ అమెరికా ప్రభుత్వం తన నిర్ణీత ఉద్దేశాన్ని ఎలా సమన్వయ పరచగలదన్న ప్రశ్నకు జవాబిస్తూ ఇంతకుముందు ఏర్పాటైన ఒప్పందాలు, సహాయతా కార్యక్రమాల్ని ఏడాది క్రితం మాత్రమే అధికారంలోకి వచ్చిన కెన్నడీ ప్రభుత్వం మన్నించక పోలేదనీ కాగా యిప్పటి సైనిక సహాయం, ఆర్థిక సహాయతా పథకాలు ఒప్పందాల వ్యవహారాలన్నీ పరిశీలనలో ఉన్నాయనీ ఈఉద్దేశంతోనే సెప్టెంబర్ 18న్స్ ఆసియా దేశాల పర్యటనకు తన్నున్నాడనీ ప్లెసింజర్ వివరించారు.

ఈనాడు ఆసియాలో రెండురకాల ఆర్థిక వ్యవస్థలమధ్య పోటీ ఉన్నదనీ ఆ వ్యవస్థలు ఒకటి ప్రజాస్వామ్య కారక్రాత్మక వ్యవస్థ, రెండోది టోటలిటేరియన్ పైనా ఆర్థిక వ్యవస్థఅనీ ఆసియాలో తన వ్యవస్థ విస్తరణకు భారతదేశం ఆటంకంగా ఉన్నందు వల్లనే చైనా భారతదేశంమీద దురాక్రమణకు తలపెట్టిందనీ కాగా ఆసియాలో నేడు చైనా, ఇండియాల మధ్య పోటీ ఏర్పడిందనీ ప్లెసింజర్ విలేఖరుల గోష్ఠిలో అభిప్రాయము వెల్లడించారు.

క్యూబాను గురించిన ప్రశ్నకు జవాబిస్తూ ప్లెసింజర్, ఫెడల్ కాస్ట్రో కమ్యూనిస్టులనిప్రకటించుకున్నాడనీ అటోటలిటేరియనిజంకు ప్రజాస్వామ్యానికి మధ్య క్యూబా ప్రజలు స్వయం నిర్ణయాధికారాన్ని అమలు పరుచుకోవాలన్న అభిప్రాయమే క్యూబాపట్ల అమెరికా విధానానికి మూలమనీ అన్నారు. కాస్ట్రో పాలనను, అయూబ్ పాలనను పోల్చవలదని విందిగా ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకాయన తాను పాకిస్తాన్‌కు ఇంకా వెళ్ళలేదని చాటవేశారు

"శాంతికి ఆహారం" కార్యక్రమం డైరెక్టర్ మెగవరన్ కూడా విలేఖరుల గోష్ఠిలో పాల్గొంటూ ఇండియా తనకు లభించే సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నదనీ అమెరికా సహాయంవల్ల స్థానిక ఉత్పత్తులకు దెబ్బ ఏమాత్రం ఉండదనీ అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో సాగుతున్న కృషిని మెగవరన్ ప్రశంసించారు.

కేర్ సంస్థ అధ్వర్యాన బడిపిల్లలకు మధ్యాహ్న భోజన సౌకర్యకల్పన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో ఏర్పాటు కాగలదని ఆశిస్తున్నానని అయితే ఇంకా యీ విషయంలో ఎట్టిఒప్పందమూ కుదరలేదనీ ఆయన ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు

రాష్ట్ర అధికారులతో చర్చలు

జార్జి మెగవరన్ నేడు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ, ఆహార, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో చర్చలు జరిపారు. ఈచర్చలకు ప్లెసింజర్, ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయార్థిక వ్యవహారాల కౌన్సిలర్ స్మిత్, మద్రాసులోని కౌన్సల్ జనరల్ మస్కాటీ కూడా హాజరయ్యారు. వీరు సెక్రటేరియట్ కమిటీ రూంలో రాష్ట్ర ఉన్నత కార్యదర్శి శ్రీ ఎం. పి. పాయ్ తదితర 11 గురు కార్యదర్శులను కలిశారు. మెగవరన్ రాజేంద్రనగర్ వెళ్ళి అక్కడి గ్రామసేవికా శిక్షణ కేంద్రాన్ని సందర్శించినప్పుడు అక్కడ గ్రామసేవికలు తయారుచేసిన "ఇడ్లీ"ని కూడా రుచిచూశారు.

అమెరికన్ అతిథులకు ఆంధ్ర పారిశ్రామిక వాణిజ్య మండలి విందు

ఆంధ్రవాణిజ్య పారిశ్రామికమండలి వారునిన్న సాయంత్రంనగరానికివచ్చిన కెన్నడీ సలహాదారులగౌరవార్థంసికింద్రాబాదు క్లబ్బులో విందుచేశారు. ఈ విందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. పి. పాయ్, పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీ ఐ. శె. నాయుడు, ఇంకా అనేకమంది ప్రముఖ అధికారులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార ప్రముఖులువచ్చారు. వాణిజ్యమండలి అధ్యక్షులు శ్రీ మాచర్ల రామారావు, సీనియర్ వైస్ ప్రెసిడెంటు శె. డి. లోహాడే అతిథులకు స్వాగతము చెప్పారు.

ఈఅధికారులిద్దరు ప్రస్తుతం భారత దేశంలో 18 రోజులపాటు పర్యటన జరుపుతున్నారు. హైద్రాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అధికారులతో వీరు రేపు ఉదయం చర్చలు జరుపుతారు. అంతకుముందు రాజేంద్రనగరులోని రిసెర్చి, ట్రయినింగ్ కేంద్రం సందర్శిస్తారు.

రాజాజీది రాజనీతికాదు క్రోధనీతి: ప్రధాని

హిమ్మత్‌నగర్, ఫిబ్రవరి11

స్వతంత్రపార్టీ వాయకుడు శ్రీ సి. రాజగోపాలాచారి చెప్పిన మాటలు తనకు అమితాశ్చర్యాన్ని కలిగజేసినవని ప్రధాని శ్రీ నెహ్రూ అన్నారు. "రాజాజీ కాంగ్రెసువారిని రాక్షసులన్నారు. ఆయన కోపములో అలా అని యుండవచ్చు. వాకు గూడా కొన్ని పర్యాయాలు కోపం వస్తుంది- కాని అదిత్వరలో తగ్గిపోతుంది. రాజాజీ కోపము చల్లారునట్టిదిగా అగుపించదు. ఇది రాజనీతి కాదు- క్రోధనీతి" అని శ్రీ నెహ్రూ నిన్న ఇచట ఒక బహిరంగసభలో చెప్పారు.

.....

బ్రిటిష్ గయానా శాసనసభలో వాక్‌ఔట్

జార్జిటౌన్, ఫిబ్రవరి 11

బ్రిటిష్ గయానా స్వాతంత్ర్యంపై లండన్ చర్చల ప్రగతినిగూర్చి ఒక ప్రకటనను పీపుల్స్ ప్రోగ్రెస్ పార్టీ అట్టార్నీ జనరల్ డా॥ రామ్‌సహాయ్ శాసనసభలో చదువుచుండగా మొన్న 14 గురు ప్రతిపక్ష సభ్యులు వాక్‌ఔట్ జరిపారు.

వాక్‌ఔట్ జరుగుటకు ముందు యునైటెడ్ ఫోర్సు, పి.ఎన్.సి. అనుకూలురు పార్లమెంటుముందు ఛడ్డీ జగన్ వ్యతిరేక నినాదాలతో విశేషటింగ్ జరిపారు.

రాజ్యాంగమును రూపొందించుటకు అన్ని పార్టీల ప్రతినిధులతో కమిటీని నియమించాలని యునైటెడ్ ఫోర్సు, పి.ఎన్.సి. వాయకులు కోరుతున్నారు.

కాంగ్రెసు అభ్యర్థులను గెలిపించండి

తుంగతుర్తి సభలో డా॥ చెన్నారెడ్డి హితవు

నల్గొండ, ఫిబ్రవరి 11

నల్గొండ నియోజక వర్గములోని తుంగతుర్తి గ్రామములో యీ నెల 8వ తేదీ రాత్రి కాంగ్రెసు యెన్నికల ప్రచారసభలో డా॥ ఎం. చెన్నారెడ్డి కాంగ్రెసు అభ్యర్థి శ్రీ కె. రామకృష్ణారెడ్డి దేశానికి, ప్రజలకు కాంగ్రెసు చేసిన సేవను వివరించారు. సభకు పరిసర గ్రామాల నుంచి 5వేల మంది ప్రజలు హాజరయినారు. శ్రీ చెన్నారెడ్డి దేశములోను, రాష్ట్రములోను యేర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలు గత 14 యేండ్లలో దేశములో అభివృద్ధిని సాధించుటకయి అమలుపరచిన ప్రణాళికా పథకాల ఫలితాలను వివరించారు. భారతదేశంలోను, రాష్ట్రములోను సుస్థిర ప్రజాపాలనను నెలకొల్పి తద్వారా బహుముఖ ప్రగతిని సాధించుటకు వీలుగా రేపు జరుగనున్న జనరల్ ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులకు విజయము చేకూర్చి కాంగ్రెస్ సంస్థను బలపర్చి గతంలో చేసిన పొరపాటును సరిదిద్దుకోవలసిందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నల్గొండ జిల్లాలో జరిగిన రెండు సాధారణ యెన్నికలలో యిక్కడ కమ్యూనిస్టు అభ్యర్థులు గెలవటము జరిగిందని యికముందు యిలా జరుగకుండా యీ ప్రాంతానికి చెందిన ప్రజలు కమ్యూనిస్టుపార్టీ వారుచెప్పే కబుర్లను చెప్తున్న పనులలోని లోగుట్టును వారి పంథాను జాగ్రత్తగా పరిశీలించి యీ యెన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులను బలపర్చుట ద్వారా తమ వ్యక్తిత్వాన్ని నిబుపుకుంటారని ఆశిస్తున్నామన్నారు డా॥ చెన్నారెడ్డి 1962లో కూడా కాంగ్రెసు సంస్థయే అధికారంలోకి వస్తుందన్న విషయాన్ని ప్రతి వ్యక్తి గుర్తు పెట్టుకోవాలన్నారాయన. ఈ నియోజక వర్గములో కాంగ్రెసు అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ కె రామకృష్ణారెడ్డి తమ ఉపన్యాసములో కమ్యూనిస్టులు చేస్తున్న ప్రచారములోని లోతుపాతులను గమనించాలని వారి వాగ్దానాలను, హామీలను చూసి మోసపోవద్దని పిడికిలప్రజానికము అభివృద్ధికయి కృషిచేసే కాంగ్రెసుకు యెన్నికలలో విజయము చేకూర్చి దాని ఉద్యమాలు నిర్విఘ్నముగా అమలు జరుగుటకు తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

బ్యాలెట్ పత్రాల ముద్రణ, రిటర్నింగ్ ఆఫీసర్లకు బట్వాడాపూర్తి

హైదరాబాదు, ఫిబ్రవరి 11

ప్రస్తుత ఎన్నికలలో పోలింగ్ ఏర్పాట్లగురించి తుది సన్నాహాలు చేయబడుతున్నాయి. 40 మిలియనుల బ్యాలెటు పత్రాలు ఇందులో 20 మిలియనులు లోకసభవి, శాసనసభవి ఇరువది మిలియనులు ప్రింటుచేయబడి రిటర్నింగ్ ఆఫీసర్లకు పంపబడినవి. రిటర్నింగ్ ఆఫీసర్లు అబ్యాలెటు పత్రాల 21580మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లకు పంపుతారు.

పార్లమెంటు నియోజకవర్గాలకై బ్యాలెట్ పత్రాలు తెలుపురంగులోను, అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్ పత్రాలు గులాబిరంగులోను అచ్చు వేయబడినవి. బ్యాలెటు పత్రాల ముద్రణ ప్రభుత్వప్రెస్ దానిశాఖలు, సెంట్రల్ ప్రెస్, తెలుగు ప్రెస్‌లు, సెక్రటేరియటు ప్రెస్‌లలో జనవరి 27నుండి ప్రారంభమై వారము రోజులలో ముగిసింది.

బ్యాలెటు పేపర్ల ముద్రించి నిర్ణీత స్థానాలకు పంపిన తొలి రాష్ట్రము బహుశః ఆంధ్రప్రదేశేమో? ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి 19వ తేదీనమరియు 21 నుండి 25వ తేదీవరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్‌కు ఒకరోజుముందుగా ఆయా పోలింగ్ స్టేషనులకు పోలింగ్‌ను నిర్వహించే ఉద్యోగులను చేర్చుటకు వివిధ రిటర్నింగు ఆఫీసర్లకు ఆదేశాలు ఇవ్వబడినవి. ప్రిసైడింగ్ ఆఫీసర్లను కలుపుకొని ఎన్నికలకయి ఒక లక్ష ముప్పది రెండువేల మంది పని చేస్తున్నారు. ప్రతిపోలింగు స్టేషన్‌కు ఆరుగురు ఉద్యోగులు పోలింగ్ నిర్వహణకై వేయబడినారు. ఇందులో ఒకరు రిజర్వు డ్యూటీలో ఉంటారు. పోలింగ్ ఆఫీసర్లకు గ్రామాధికార్లు ఓటర్ల గుర్తుపట్టడానికి తోడ్పడుతారు.

భోపాల్, ఫిబ్రవరి 11

ఈ జనరల్ ఎన్నికలలో కాంగ్రెస్ అధికార అభ్యర్థులకు పోటీగా నిలిచినందుకు మరో 21 మంది కాంగ్రెసు వాదుల మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పంస్థ నుండి తొలగించి వేసింది. ఇప్పటివరకు ఇక్కడి కాంగ్రెస్ కమిటీ తొలగించివేసిన కాంగ్రెస్ వాదుల సంఖ్య పిరిరి కలుపుకొని 80.

కాంగ్రెసువాదులపై దుశ్చర్య

ఇద్దరికి తలలకు గాయాలు

అలహాబాద్, ఫిబ్రవరి 11

తలపై గాయాలు తగలడంవల్ల ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు స్థానిక ఆస్పత్రిలో చేర్చబడినారు అలహాబాద్ ఉత్తర నియోజక వర్గం నుండి అసెంబ్లీకి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేయడానికి వీరు పొరుగు గ్రామానికి వెళ్ళగా, ప్రత్యర్థి వర్గాలవారు వీరికై రాళ్ళు రువ్వారట. పోలీసులు యీ విషయమై దర్యాప్తు చేస్తున్నారు.

.....

ఏప్రిల్ 14, 15 లలో పంజాబీ మేలా

హైద్రాబాద్, ఫిబ్రవరి 11

ప్రతి ఏటా జరిపే వైశాఖి మేలాను ఈ సంవత్సరం గూడా ఏప్రిల్ 14,15 తేదీలలో ఆంధ్రప్రదేశ్ పంజాబీ సభ నిర్వహించగలదు.

ఈ మేలాలో ఆటలు మాత్రమే కాక "మీనాబజారు" ఇతర వినోదాలు మద్రాస్, బొంబాయి, పంజాబీ ఆర్టిస్టులచే వినోద కార్యక్రమాలు తెలుగు ఉర్దూ హిందీ పంజాబీలలో ఉంటాయి. రఫీ గీతాదత్ ఓంప్రకాశ్ ఘంటశాల మున్నగువారికి ఆహ్వానాలు పంపబడినవి.

తెలంగాణ గ్రామ అధికార్ల సమ్మె వాయిదా

హైద్రాబాద్, ఫిబ్రవరి 11

ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పల్లంరాజు యిచ్చిన హామీని పురస్కరించుకొని తెలంగాణ గ్రామాధికార సంఘ కార్యనిర్వాహక వర్గం సమ్మెను వాయిదావేయుటకు తీర్మానించినది.

ఎన్నికలు జరుగుచున్నందున ప్రస్తుతానికి సమ్మెను వాయిదావేయుటకు మథోల్‌లో యీనెల 8వ తేదీన జరిగిన సమావేశంలో తీర్మానించినైనదని సంఘ కార్యదర్శి శ్రీ పి లక్ష్మీనరసింహారావు విలేఖరులకు తెలిపారు.

గ్రామాధికార్లు యెన్నికల కార్యక్రమాలలో సంపూర్ణంగా సహకరించాలని శ్రీ లక్ష్మీనరసింహారావు విజ్ఞప్తిచేశారు.

హిందూమతాదాయ కమిషన్

మార్చి వరకు నివేదిక నందజేందని అధ్యక్షుని వెల్లడి

ఊటి, ఫిబ్రవరి 11

హిందూ మతాదాయ కమిషన్ తన పనిని పూర్తిచేస్తుందని, ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో సమావేశమై నివేదికను రూపొందిస్తుందని కమిషన్ అధ్యక్షులు డా॥ సి. పి. రామస్వామి అయ్యర్ నేటిచట విలేఖరులకు చెప్పారు. నివేదిక మార్చిమాసాంతం వరకు ప్రభుత్వానికి అందజేయబడుతుందని కూడా ఆయన తెలిపారు.

మతతత్వ పార్టీలు దేశానికి ప్రమాదకరం

వానికి ప్రజలు ఓటుచేయరాదని ప్రధాని నెహ్రూ ఉద్బోధ

బరోడా, ఫిబ్రవరి 11

దేశ స్వాతంత్ర్య పరిరక్షణకు ప్రజలను ముందుకు తీసుకొని వెళ్ళడానికి అన్నిటికన్నా ప్రధాన అవసరం ఐక్యత అని ప్రధాని నెహ్రూ ఇక్కడ ప్రబోధించారు.

నేటి ఉదయం ఇక్కడ ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ శ్రీ నెహ్రూ ఐక్యత లేకపోతే విచ్ఛిన్న కరశక్తులు విజృంభించి దేశాన్ని నాశనం చేయగలవని హెచ్చరించారు.

ప్రధాని నెహ్రూ ప్రసంగాన్ని ఆలకించడానికి దాదాపు 80 వేల మంది ప్రజలు ఈ సభకు వచ్చారు మతతత్వ పక్షాలు ఐక్యత పునాదుల బలపరచగలవని జాతీయతను విచ్ఛిన్నంచేసే మతతత్వం భారతదేశానికి హానికరమని ప్రధాని నెహ్రూ చెప్పారు. "ఒకే వర్గం ప్రజలు మరగోరే రాష్ట్రం జాతీయతా భావానికి వ్యతిరేకం. పాకిస్తాన్ ముస్లిం రాష్ట్రం కావడంవల్ల అక్కడి హిందువులు నానా అగచాట్లు పడినారు- అదే విధంగా హిందూ రాష్ట్రాన్ని ఏర్పరుస్తే ముస్లింలు బాధపడుతారు- కావున ఇట్టి భావాన్ని మనం కోరడంలేదు. అన్ని వర్గాలు మతాలకులాలు నివసించే సమాన హక్కులు అనుభవించే దేశాన్నే మనం కోరుతున్నాం- పరస్పర సహనం కలకట్టుతనం మనకు కావాలి" అని నెహ్రూ వివరించారు-

భారతదేశంలో ఐదు కోట్ల ముస్లింలున్నారు- వారంతా మనదేశపౌరులే, వారు పరాయివారుకారు ప్రజలలో వీరికలు తెస్తే ప్రజలను వేరుచేసే మత పక్షాలు హానికరం- ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి వీనివల్లనే దేశం బలహీనపడుతున్నది కాంగ్రెస్ ఒక్కటే సమర్థమైన సంస్థ దానికి ఓటు చేయాలనికోరారు వీరు.

సామ్యవాద వ్యవస్థ స్థాపనకు యితర పార్టీల అంగీకారం

పొందాల్సిన అవసరం కాంగ్రెసుకు లేదని శ్రీ నెహ్రూ

ఖుజ్, ఫిబ్రవరి 11

భారత దేశంలో సామ్యవాద వ్యవస్థా నిర్మాణ విషయంపట్ల కాంగ్రెస్ యితర పార్టీల అంగీకారాన్ని కోరాల్సిన అవసరం లేదని ప్రధాని నెహ్రూ నిన్న ఇచట ఒక బహిరంగ సభలో ప్రకటించారు.

కాంగ్రెస్ సామ్యవాద వ్యవస్థను కోరుతుంది. ఈవిషయంలో సందేహం లేదు. యితరుల అంగీకారము మాకవసరములేదు సామ్యవాదవ్యవస్థ అంటే యేమిటి? ప్రతియొక్కరికిసమాన అవకాశాలు కల్పించుట. సమాజంలో బీద ధనికవర్గాల భేదాన్ని తొలగించుట వ్యక్తిస్వాతంత్ర్యమునకు భంగం వాటిల్లకుండా శాంతియుత మార్గాల ద్వారా అట్టి వ్యవస్థస్థాపనే కాంగ్రెస్ లక్ష్యమని శ్రీ నెహ్రూ అన్నారు.

సామ్యవాద వ్యవస్థను, ప్రణాళికను వ్యతిరేకించువారు స్వతంత్ర పార్టీలో చేరారు. ప్రణాళికను, దేశములో జరుగుచున్న ప్రతి మార్పును వ్యతిరేకించుటే వారిధ్యేయం యీ స్వతంత్రపార్టీలో కొందరు మాజీ రాజులు, మహారాజులు, జమీందార్లు, తాలూక్దార్లు, జాగీర్దార్లు అట్టిపోవుటకు చెందిన యితరులున్నారు అని ప్రధాని తెలిపారు.

ప్రణాళికాబద్ధమైనకృషిని మనము చేయకున్న ధనికులు మరి ధనికులుగా, పేదలు నిరుపేదలుగా మారు ప్రమాదముందని ప్రధాని హెచ్చరించారు. ప్రణాళికలను స్వతంత్రులు వ్యతిరేకించుట పట్ల శ్రీ నెహ్రూ ఆశ్చర్యం వెలిబుచ్చారు.

ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టులకు ప్రాతికూల్యం

రోజు రోజుకూ కాంగ్రెస్ విజయావకాశాలు హెచ్చుచున్న వైనం

(మా ప్రత్యేక విలేఖరి)

ఖమ్మం, ఫిబ్రవరి 11

ఖమ్మంజిల్లా మొత్తములోను ఎన్నికల వాతావరణము ఏరోజుకారోజు మారుతూనేఉన్నది ఈజిల్లాలో కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీల ప్రచారం భారీఎత్తున సాగుతున్నది. తెలంగాణాలో కమ్యూనిస్టులకు జీవన్మరణ సమస్య అని ప్రజలు చెప్పుచున్నారు. కాంగ్రెసులో గ్రూపు విభేదాలున్నప్పటికీ ఏకమయి ప్రచారం చేస్తున్నారు- ఆంధ్ర కాంగ్రెసు అగ్రనాయకులు, మాజీ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ యు. యన్. ఢేబర్ ఈజిల్లాలో పర్యటించుటచే కాంగ్రెసుకు తగు బలము చేకూరినది. కేరళ మాజీముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ ఎన్నికలో బహిరంగ సభల్లో ఉపన్యసించారు. ఇది ఇట్లా యుండగా స్థానిక కాంగ్రెసు కమ్యూనిస్టులు గ్రామ గ్రామములకు వెళ్ళి ఇంటింటా ప్రచారము చేస్తున్నారు. ప్రస్తుతము పరిస్థితి కాంగ్రెస్‌కే అనుకూలమున్నదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. జిల్లాలో కాంగ్రెసు, కమ్యూనిస్టుల మధ్య ప్రధాన పోటీ లున్నాయి. ఆంధ్రలో కొత్తగా పుట్టిన స్వతంత్ర పార్టీ, జనసంఘములు పలుకుబడి లేకున్న తమ అభ్యర్థులను ఏ రెండు మూడు స్థానాలకు నిలుపుకొన్నాయి. కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సంజీవ రెడ్డి అతిత్వరలో జిల్లాకు రానున్నారని కాంగ్రెసు నాయకులు చెప్పుచున్నారు. శ్రీ రెడ్డి రాకచే కాంగ్రెసుకు మరింత బలము చేకూరునని ఎన్నికల పరిశీలకులు భావించుచున్నారు. బూర్గంపాడు, మధిర నియోజక వర్గాలలో ముఖాముఖి పోటీ ఎల్లందు, పాల్వంచ, వేమూరు, ఖమ్మం అసెంబ్లీ స్థానాలకు త్రిముఖ పోటీ, భద్రాచలంలో నలుగురు పోటీలో ఉన్నారు.

ఎల్లందులో శ్రీ బొమ్మకంటి సత్యనారాయణరావు (కాం), శ్రీ కె. యల్. నర్సింహారావు (క)ల మధ్య తీవ్రమయిన పోటీ ఉన్నది. కాని కాంగ్రెసు గెలుపు తథ్యమని ప్రజలు చెప్పుకొనుచున్నారు. బూర్గంపాడు నుండి కె. రామయ్య (కాం), కె. బుచ్చయ్య (క)ల మధ్య ముఖాముఖి పోటీ ఉన్నది. కాంగ్రెసు గెలుపు ఖాయమని కొందరు, కమ్యూనిస్టు అని కొందరు అంటున్నారు.

భద్రాచలంలో శ్రీమతి వాణీ రామారావు (కాం) శ్రీ మహమ్మద్ జైనీల మధ్య గట్టి పోటీ ఉన్నది కాని కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనబడుచున్నాయి.

పాల్వంచలో శ్రీ రాజావెంకట రామారావు (కాం) శ్రీ పి సత్యనారాయణరావు మధ్య పోటీ యున్నదని చెప్పకతప్పదు. ఎవరు గెలిచేది చెప్పుట సమస్యగా యున్నది. వేమూరులో శ్రీ శెవెంగళరావు(కాం) శ్రీనాగేశ్వర్ రావుల మధ్య తీవ్రమయిన పోటీ ఉన్నది. ముఖ్యముగా యీ నియోజక వర్గములో ఎన్నికల కోలాహలముగా నున్నది. కాంగ్రెసు, కమ్యూనిస్టులు అతి చురుకుగా ప్రచారములు చేస్తున్నారు. కాంగ్రెసు గెలువ గలదని పరిశీలకుల భావన. మధిరలో శ్రీ వెంకటయ్య (కాం), శ్రీ ఆర్. శంకరయ్యల మధ్య పోటీయున్నా కాంగ్రెసు గెలుపు ఖాయము.

ఖమ్మంలో శ్రీ పి శ్రీనివాస్ రావు (కాం) శ్రీ ఎన్. ప్రసాదరావులమధ్య పోటీ బాగుగానే యున్నది. పోలింగ్ తేదీలు దగ్గరపడ్డ కొలదీ కాంగ్రెసు వైపు ప్రజలు మొగ్గుతున్నారు. పార్లమెంటు స్థానానికి శ్రీమతి లక్ష్మీకాంతమ్మ (కాం) శ్రీ విఠల్ రావు (క)ల మధ్య ముఖాముఖిపోటీఉన్నది శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గెలిచే అవకాశము ఉన్నదని చెప్పబడుచున్నది. మొత్తానికి కమ్యూనిస్టుల కన్న కాంగ్రెస్ ఎక్కువ స్థానాలు గెలుచుకొనగలదని మావిలేఖరి తెలియజేస్తున్నారు.

దిహైద్రాబాద్ పాలిటెక్నిక్

ఖుర్షీద్‌జా బారాదరి

షాహగంజ్ హైద్రాబాద్ (ఆం. ప్ర)

1962 ఫిబ్రవరి 20వ తేదీలోగా ప్రిన్సిపాల్‌కు అందునటుల ఈ దిగువ ఉద్యోగములకై అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరబడుచున్నవి:-

	స్థానము	స్కేలు
1. మెకానికల్ ఇంజనీరింగ్‌లో అసిస్టెంట్ లెక్చరర్	1	రు. 280 - 500 అదనముగా అలవెన్సులు
2. సివిల్ ఇంజనీరింగ్‌లో అసిస్టెంట్ లెక్చరర్	1	రు. 280 - 500 అదనముగా అలవెన్సులు
3 ఫిజికల్ డైరెక్టర్	1	రు. 100 - 200 అదనముగా అలవెన్సులు

యోగ్యతలు:- మొదటి ఒకటి, రెండు ఉద్యోగములకై ఆ సబ్జెక్టులలో కనీసం సెకండ్ క్లాస్ డిగ్రీ అయినా కలిగి ఉండాలి. మూడవ ఉద్యోగమునకై అభ్యర్థి ఇంటర్‌మీడియెట్ ప్యాసయి ఫిజికల్ ఎజుకేషన్‌లో డిప్లొమా కలిగిఉండాలి వివిధ ఆటలలో ప్రత్యక్ష అనుభవం ఉండాలి.

రిటైర్డు వ్యక్తులుగూడా అప్లయి చేయవచ్చును.

ఇట్లు

ప్రిన్సిపాల్

జంట నగరాలలో 16-2-62 శుక్రవారంనుండి విడుదల

జగపతి పిక్చర్స్‌వారి:

ఆరాధన

(తెలుగు)

(రెండు రీళ్ళు గేవాకలర్)

ప్రముఖ నటీనట సమ్మేళనం:

ఎ నాగేశ్వరరావు, సావిత్రి, జగ్గయ్య, రేలంగి, గిరిజ, రమణారెడ్డి, రాజశ్రీ, రీటా. గెస్టార్టిస్టులు:- గుమ్మడి, నాగయ్య.

నిర్మాతలు: రంగారావు, రాజేంద్ర ప్రసాద్.

దర్శకత్వం: వి. మధుసూదనరావు

సంగీతం: ఎస్. రాజేశ్వరరావు

కమల్ హైద్రాబాద్ ★ ప్యారడైజ్ (పర్‌కండిషన్డు) సికింద్రాబాద్.

రెండు థియేటర్లలో శుక్ర, శని, ఆది 4 ఆటలు: ఉ॥ 11-0, 2-30, 6-0, 9-30

సోమవారంనుండి 3 ఆటలు: 2-30, 6-0, 9-30

లక్ష్మి - వరంగల్. శశిమహల్ - రాయ్‌చూర్

అమర కవి 'నిరాలా'

శ్రీ హీరాలాల్ మోరియా

అతి విచిత్రమైన యీ జగత్తులో యేది యెందుకు జరుగుతుందో ఎవరికీ తెలియదు. కొంతమంది పుట్టుకతో నే భోగులుగా జన్మించి, కొరత అనేది యెందులోనూ యెరక్కుండా ప్రపంచంలోనే స్వర్గసుఖం అనుభవిస్తూ సుఖలాలసులుగానే అంతమవుతారు. ప్రపంచం సుఖం అనుభవించడానికేగాని దుఃఖంకోసం నిర్మితము కాలేదంటారు. దుఃఖం అనే పదము కూడా వుందన్నా వీరు ఒప్పుకోరు. ఇంకొక రకం వ్యక్తులుంటారు. వీళ్లు తమ జన్మతోపాటే ఆందోళనలనూ, సమస్యలనూ వెంట తీసుకుని భూమ్మీద పడి, తుది శ్వాస విడిచేవరకూ ప్రపంచంతో సంఘర్షణ పడుతూ, ప్రపంచంలోని కశ్మలాన్ని కడిగేయటానికీ, మమషులంతా సుఖపడటానికీ ఏదో ఒకటి చేస్తూనేవుంటారు. తాము దుఃఖం అనుభవిస్తూ తమ పొరుగువారు సుఖపడాలని కోరతారు. పై రెండు రకాల వ్యక్తిత్వాలనూకూడా కాలం నిర్దాక్షిణ్యంగా కబళిస్తుంది. కాని, సుఖలాలసులూ, భోగులూ చరిత్రచ్ఛాయలలోమాత్రం కనపడరు. ఆందోళనలూ, సమస్యలతో ఆహారం పోట్లాడేవారే చరిత్రాకాశములో చందమామ వలె, నక్షత్రాల వలె శాశ్వతంగా ప్రకాశిస్తుంటారు.

సుఖానుభోగులకు సమస్యలు కనుపించవు. అలాంటివారికి ఆందోళనలు పట్టవు. కాని, బ్రతుకంతటా అడుగడుగునా సమస్యల నెదుర్కొనే వారికి జీవితమంతా ఉద్యమంలాగే గడిచిపోతుంది. ప్రముఖ హిందీ మహాకవి శ్రీ నిరాలా'' జీవితం ఇందుకు చక్కని ఉదాహరణ. భారతీయ సాహిత్యాకాశంలో నిరాలా ఒక వజ్ర నక్షత్రం. హిందీ కవితారంగములో అపూర్వమైన విప్లవోద్యమాన్ని నిర్వహించి, అడుగడుగునా యెదురయే కువిమర్శలనూ, వ్యతిరేకతలనూ ధైర్యంతో ఢీకొని, తాను విశ్వసించిన ఆదర్శాల నిమిత్తం పోరాడిన సాహసిక వీరయోధుడు. హిమాలయం లాంటి స్థిరమైన వ్యక్తిత్వంతో తన కవిత్వమనే గంగాప్రవాహాన్ని అనునిత్యం ప్రవహింపజేస్తూ సాహితీ భారతాన్ని పునీతం చేసిన మహాకవి శ్రీ "నిరాలా"

శ్రీ "నిరాలా" మహాకవి జీవితాన్ని యథార్థ దృష్టితో కూలంకషముగా పరిశీలిస్తే, ఆయనొక కవి కాక, మహోన్నత శాస్త్రీయ దృక్పథంతో మానవత్వాన్ని పునరుజ్జీవింప చేయడానికి కంకణం కట్టుకున్న "మహామేధావి'' అనికూడా తెలుతుంది. ప్రతుకులలో నూతనత్వం కోసము నూతన రాగాలాపన జరిపిన అమర గాయకుడు. దుఃఖాలూ, దారిద్ర్యాలూ గిల్లోలాలూలేని మానవ నవ 'ప్రపంచాన్ని నిర్మించటంకోసం తుది వరకూ ప్రయత్నించిన వైజ్ఞానికుడు. "నిరాలా" వ్యక్తిత్వమే ఒక మహోన్నత వ్యవస్థ.... జీవిత రాజపథంలో చివరి నిశ్వాసము విడిచేవరకూ అతి దర్పంతో రొమ్ము విరుచుకుని, శిరస్సు వంచకుండా చరించిన ఉద్ధతుడు... తన సర్వస్వము త్యాగం చేసి, ఫలితాన్ని తోటివారికి అర్పించడానికి వెనుదీయని ఉదార మూర్తి.

ఒకానొక కాలంలో కవిత్వము కేవలము రారాజులూ, రాజులూ, ధనాధిపతుల ప్రశంసాభివర్ణనల కోసమే ఉపయోగించబడుతుండేది. ఆ కాలం క్రమంగా అదృశ్యమవుతూ యీనాటికి పరిపూర్ణంగా అంతరించిపోయింది.

కవితా ప్రపంచంలో యిలాటి పరిణామం యేర్పడటానికి యీ శతాబ్దపు కవులలో శ్రీ "నిరాలా" వంటివారు అగ్రేసరులుగా నిలబడ్డారు. పూరి గుడిసెలలో, పల్లెటూళ్ళలో, దుర్గంధ ధూంఆమ్లమయిన మురికి సందులలో కాలక్షేపం చేసే అసంఖ్యాక ప్రజలు నేటి కాలంలో తమ ప్రాధాన్యమునూ, కృషి ఫలితాన్నీ అర్థము చేసుకోవటానికి వారి జీవిత రథాల పగ్గాలను వారే స్వయంగా ధరించి పురోగమించటానికి కవిత్వం ఉపయోగపడాలంటూ శ్రీ నిరాలావంటి ఆదర్శ సాహితీమూర్తులు సృష్టించిన విప్లవోద్యమం వేయి పుష్పాలు పూచి వికసించి సంపూర్ణ ఫలవంతమైందని చెప్పవచ్చు. దేశంలో నవజాగృతీ, నవోత్తేజం పెరిగిపోతూ జీవితాలు సుఖమయం కావటానికి దేవతలూ, దెయ్యాలను పూజించే మూఢత్వముతో లగిపోతున్నది. కర్మాధీనులై, నిష్క్రియాలై కూర్చునే ఆలసభావం అంతర్హితమవుతుంది. ప్రతివారూ ఆత్మవిశ్వాసంతో ఆలోచనాశక్తితో శ్రమించి తమ భవిష్యత్తుకి తామే కర్తలవుతున్నారు. తప్పనిసరిగా గుర్తించితీరవలసిన యీ సత్యాన్ని గుర్తించి, మానవ జీవిత పురోగమనానికి నివాళులర్పించి మంచి బాటలు వేయటానికీ, యింకా మత్తులో అక్కడక్కడా పడివున్న మానవులను మేల్కొల్పడానికీ నిరాలా చేసిన కవితా సేవ అమోఘమైంది. తన పవిత్రాదర్శ గ్రంథాన్ని ప్రజలముందు పరచి చదివి వినిపించాడు. జీవశక్తినీ, చైతన్యాన్నీ పెంపొందించి, అసమానతలు దూరం చేయటమే కవితా పరమార్థం అని శ్రీ నిరాలా భావించాడు. సమాజం, న్యాయ స్థితులలో తారతమ్యం చూపే వ్యవస్థను గర్హించాడు. జుగుప్సాకరమైన, తరతమాలూ, ఉచ్చనీచాలూ పాటించే అన్యాయ వ్యవస్థమీద యుద్ధం ప్రకటించి శంఖారావం చేశాడు.

"బ్రతుకులోని వాస్తవికతను గుర్తించి, వాస్తవాన్నే ప్రదర్శించి సమస్యలు పరిష్కారం కావడానికి తోడ్పడేదే కవిత్వం. అది వ్రాయటానికి కలం పట్టినవాడే కవి" అన్నది నిరాలా విశ్వాసం.

ఇప్పటికి కొన్ని దశాబ్దాలనుండీ దేశంలో విప్లవకరమైన పరిణామాలు యేర్పడుతూవస్తున్నాయి. ఎంతో స్థిరమైనవని విశ్వసిస్తూ వచ్చిన పురాతన పద్ధతులు హేతువులూ, తర్కానికి నిలబడక గాలిలో తేలిపోతూ వచ్చినవి. మానవుడి ఆలోచనా పద్ధతులలోనే అపూర్వమైన మార్పు వచ్చేసింది. జీవితానికి నూత్నార్థము సృష్టింపబడి, యావత్ప్రపంచమే కొత్త పునాదులమీద నిర్మింపబడుతూన్నది. ఈ సంధి తరుణములో శ్రీ నిరాలా కలం పట్టి, భవిష్యత్తులో ప్రవేశించి ఆశామయ సౌధాలను మానవుల నిమిత్తం సృష్టించాడు.

వర్తమాన సాహిత్యంలో పెనుతుఫానును సృష్టించి, పురాతన ఛాందసాన్ని మూలద్రోసి పటిష్ఠమైన నూతన సందన్సును నిర్మించాడు. ఆయన సూత్రాలు అందరినీ ప్రభావితము చేసినవి. బలమైన ఆలోచన, క్రియాత్మక భావన, జీవశక్తి నిండిన శ్రీ నిరాలా కృతులు దేశ కాలావలు లేకుండా అందరి హృదయాలనూ ఆకర్షిస్తాయి. అందుకే ఆయన మహాకవి.

"నిరాశ" అనే పదానికి నిరాలా నిఘంటువులో తావు లేదు మానవతావాదంవట్ల దృఢమైన విశ్వాసంతో బ్రతికాడు. పుట్టుభోగులుగా, నిష్కర్ములుగా జీవించడంలో నిజమైన సుఖం లేదనీ, శ్రమ శక్తితో సత్యపథంలో సమస్యా పరిష్కారము నిమిత్తం కృషి చేయడంలోనే సుఖానందాలున్నాయనీ ఋజువు చేశాడు. అదే ఆకర్షవంతమైన సౌందర్య జీవితంగా ఆరాధించాడు. సత్యాన్ని వర్ణించడమే సాహితీ ప్రయోజనం అని వర్ణించాడు.

వ్యక్తిగత జీవితంమీద కాలము మోపిన కష్టాలూ, దుఃఖాల భారాన్ని ధీరుడై సహించి నిరంతరం ముందుకే సాగిపోయాడు, కాని, మంచి కాలం కోసం యెక్కడో పొంచి చూస్తూ కాలం గడుపలేదు "నిరాలా" సాంసారిక జీవితంలో అత్యంతమైన ఆర్థిక దుస్థితికి గురి అయినా, యెవరి ముందూ శిరస్సు వంచలేదు. భార్య వ్యాధిగ్రస్తురాలై మంచం పట్టిన స్థితిలో వైద్యం చేయించుకోవడానికి నిస్సహాయుడైన స్థితిలోకూడా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం వదులుకోలేదు. ఆకలి బాధతో ఆత్మశరీరం దహించుకుపోతున్నా, అర్థించినవారికి అంతో యింతో సహాయం చేస్తూ వచ్చిన వదాన్యుడు. సారస్వత సేవలో లోపం ఎన్నడూ రానీయక కవితా జ్వాలను నిరంతరం వెలిగించటానికి తన రక్తాన్నే తైలముగా ఉపయోగించాడు. ఆయన అనుభవాలు అగ్ని స్ఫులింగాలయి, కావ్యజ్వాలా తోరణాలై హిందీ సాహిత్య రంగములో విప్లవాన్ని రేకెత్తి పెరుపులు మెరిపించి అందరికీ మార్గదర్శకాలైనవి. పవిత్రమైన దేశభక్తిని ప్రబోధించి మానవులను కర్తవ్యోన్ముఖులుగా చేసినవి, ప్రజా గౌరవానికి పాత్రుణ్ణి కూడా చేసినవి.

జీవిత సత్యం యెప్పుడేది స్ఫురిస్తే అప్పుడే అది అందరికీ వివరిస్తూవుండేవాడు నిరాలా. సమస్యలూ, సంచలనం లేని జీవితం శవపాయమైందనీ, సమస్యలూ, కష్టాలలోకూడా విశ్వాసము కోల్పోనుండా చిరునవ్వుతోవుండేవాడే యథార్థ మానవుడనీ ఆయన భావించాడు. మానవత్వానికి సంబంధించిన మహోద్వేగ్న సత్యాలను ఆవిష్కరించాడు, ఆయన కవిత్వము వాస్తవాలతో నిండిన బొమికల పోగువలె శాక, కళాత్మకంగా సౌందర్యం ఉద్దీపింపజేస్తుంటుంది. యథార్థానికి కళా కవచం తొడిగి అందముగా సారస్వతాన్ని ప్రదర్శిస్తుండేవాడు.

పదిహేడు సంవత్సరాల ప్రాయం నుండీ సారస్వత సేవలో ప్రవేశించి ఎన్నో విమర్శలనూ, పరిహాసాలనూ, ఈతిబాధలనూ ఎదుర్కొని, ఎన్నడు కూడా నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా బ్రతికినంత కాలం తన వాణిని ప్రపంచంలో ప్రతిధ్వనింపచేశాడు.

శ్రీ నిరాలా నేడు మన మధ్యన లేకుండా అదృశ్యమై ఆమరుడై పోయాడు. కాని, ఆయన కళాత్మక కావ్యస్మృతులు సుగంధ పరిమళాన్ని వెదజల్లుతూ శాశ్వతమై, నిత్యనూతనమైవున్నాయి. జీవించి వుండగా తన కృషికి తగిన అర్హతా స్థానాన్ని ఆయనకు దేశం ప్రసాదించలేకపోవడం శోచనీయం. ఇది నిజముగా మన అవాస్తవికతనే ప్రదర్శిస్తుంది. లోకం తనను గుర్తించి గౌరవించలేదన్న భావం నిరాలా కేనాడూ లేదు. అది ఆయన కావ్య ఖండికలలో ఛాయామాత్రంగానైనా ప్రస్ఫుటం కాలేదు కావ్యకల్పనల రోజులలో ఒక్క అభినందన వాక్యంకూడా ఆయన మన దేశీయ సారస్వత ప్రభువులనుండి అందుకోలేకపోయినా, అందరి కోసం జీవితాన్ని ఆహుతిగా చేసుకొనే జాజ్వల్యమాన జ్యోతిగా ప్రకాశించాడు.

మహాకవులనూ, కళాకారులనూ, వారి ప్రాధాన్యమునూ బ్రతికివుండగా గుర్తించి, ఆదరించలేని దౌర్భాగ్యం అనాది నుండీ మనకు సాంప్రదాయముగా వస్తూన్నట్టుంది- ఇది దురదృష్టకరమైన దుస్థితి- జాతికి పట్టిన గ్రహణపు చీకటి- అగ్నిపరీక్షా తుల్యంగా జీవితాలు గడుపుతూ, ఎందరో మహానుభావులు తనువులు విడిచారు- తరవాత నే వారిశక్తిని మనం గుర్తించి దీపారాధనలు జరుపుకుంటున్నాం కాని, బ్రతికివుండగా ఒక్క సానుభూతి వాక్యం కూడా పలకలేక పోతున్నాం- ఇదిమనం దూరదృష్టితో ఆలోచించి, దూరం చేసుకోవలసిన దుస్థితి- అప్పుడే దేశీయ వైకల్యం ద్విగుణోద్దీపితమవుతుంది- కవులనూ, వారి అవసరాన్నీ, ఔన్నత్యాన్నీ బ్రతికివుండగా గుర్తించలేని వాతావరణంలో పుట్టి, పెరిగి దేశానికి నవ ప్రబోధం జరిపి, తనువు విడిచి, పరమపదించిన శ్రీ నిరాలా కీర్తిశేషుడు- ఈయన శేషకీర్తిలో, ఎన్ని ప్రశంసార్హమైన అంశాలున్నాయో, భవిష్యత్ప్రపంచం దానంతటదే గమనించి తీరుతుంది.

శ్రీ నిరాలా వృతి ఒక హిందీ సాహిత్య రంగానికే కాక, అభ్యుదయ భారత సారస్వతం అంతటికీ తీరని లోటును కలించింది. నేటి సాహితీ పిపాసుల అంతరంగాలలో ప్రజా హృదయాలలో స్థిర నివాసం యేర్పరచుకున్న శ్రీ నిరాలా జీవితం ధన్యం. మరచిపోదామన్నా మరుపురాని నిరాలా వ్యక్తిత్వం సర్వదా స్ఫూర్తిమంతం. ఆయన సంపూర్ణ వ్యక్తిత్వానికీ, ఆదర్శ ప్రజ్ఞా సంపత్తికీ జోహార్లర్పించటం ప్రతి భారతీయుడి విధ్యుక్తధర్మం.

మనోనిబ్బరానికి మాయుమాట లనవసరం

అరాచక చర్యల అదుపులో పెట్టవలెనని నల్లగొండ జిల్లాకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రకటన

"నల్లగొండ జిల్లాలో కాంగ్రెసు కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల రంగంలో తమ తమ యావత్తు శక్తిని కేంద్రీకరిస్తున్నాయి. సందేహములేదు. జయాపజయములు ఓటింగు తర్వాత ఎలాగైనా తేలుతాయి. కాని యీలోగా చేయు ప్రకటనలు తమ పార్టీ ప్రయోజనాలకు ఉపయోగపడతాయనేజాస్తారు. ఇది అసహజం కాదు. ఒకవాస్తవ విషయాన్ని ప్రజల దృష్టికి తెచ్చుట తప్పుకాదు. ఈ రోజువరకు నల్లగొండ జిల్లాలో అనేక మంది కమ్యూనిస్టు ముఖ్య కార్యకర్తలు రాజీనామాచేసి కాంగ్రెసులో చేరినారు. వారి సంఖ్య నూటికి 25 కు తక్కువలేదు- లిఖిత పూర్వకమైన రాజీనామాల పత్రాలున్నాయి." అని నల్లగొండ జిల్లా కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ సి. తిరుమలరావుగారు తెలుపుతున్నారు- వారి ప్రకటనలో ఇంకా ఇలా కలదు:-

కమ్యూనిస్టులకు ఒక పాలసీ, ప్రోగ్రాము, సవ్యమైన మార్గం, సహేతుకమైన విమర్శ లేనప్పుడు, సద్భావం లేని దేశభక్తి వున్నప్పుడు, అరాచక చర్యలతో బ్రతుకుతున్నప్పుడు, నిజాయితీ గలవారు కమ్యూనిస్టు పార్టీలో ఎందుకుంటారు? ఇందుకు శ్రీ వెంకటేశ్వరరావు హృదయం పరితపించుట లేదా? లేకపోతే కమ్యూనిస్టు పార్టీలో వున్నవారికి వాస్తవాన్ని అర్థం చేసుకొను లక్షణాలు మృగ్యమైయుండాలి.

ఎన్నికల ప్రచారం ప్రారంభమైన యీ నెల రోజులలో 173 కమ్యూనిస్టు కార్యకర్తలు రాజీనామా పత్రాలు పంపించారు- ఇది కమ్యూనిస్టు పార్టీలో తీవ్ర సంక్షోభాన్ని చూపెట్టుచున్నది.

నల్లగొండజిల్లా ప్రజానీకంయొక్క ఆలోచనా విధానంలో చాలా మార్పు కానవస్తున్నది- రెండు జనరల్ ఎలక్షన్‌లలో కమ్యూనిస్టులు గెలిచి చేసింది యేమిటి? ప్రజల సమస్యలను కనీసం రిప్రజెంటేషన్ చేసినట్లు ఎక్కడా అగుపడుటలేదని సర్వత్రా భావించబడుచున్నది- మేధావి వర్గమ వయోవరులకు కమ్యూనిస్టుల ఎడల సందేహాలు ఉన్నవి. చైనా దురాక్రమణను సమర్థించుట పదేపదే ప్రకటనలకు వక్రభాష్యములు చేయుటవల్ల కమ్యూనిస్టుల నీతిని శంకిస్తున్నారు- కాంగ్రెసు వైపు మొగ్గుతున్నారు- దీనికి కాంగ్రెసుపై కమ్యూనిస్టు పార్టీ వారు విసుర్లు సాగించే దానికంటే తమ స్థితిని తాము సంబాళించుకోవాలి.

కాని జిల్లాలో 1947 పరిస్థితులు వస్తాయని కమ్యూనిస్టులు బాహాటంగా బెదిరిస్తున్నారు- అనేకచోట్లదాడులు ప్రారంభించారు- కుప్పలు తగులపెట్టుచున్నారు- కాంగ్రెసు కార్యకర్తల తలకాయలు బ్రద్దలు చేస్తున్నారు దిన మొక రీతిగా కమ్యూనిస్టుల దుండగాలు వ్యాపిస్తున్నవి.

ఈ దుర్మార్గపు చర్యలకు ఫలితాలు ఏమిటో కమ్యూనిస్టులు గ్రహించక చేస్తున్నవి కావు- గ్రామాలలో పరిస్థితులు ఎదురు తిరుగుతున్నకొలది వెర్రి ఆవేశాలకు లోనౌతున్నారు- వాటిని అదుపులో పెట్టే బాధ్యత వారి నాయకత్వము స్వీకరించాలి- లేదా ప్రభుత్వమైనా స్వీకరించాలి- లేనిచో కాంగ్రెసు కార్యకర్తలే తమను తాము కమ్యూనిస్టుల నుండి రక్షించుకుంటారు- ఎన్నికలలో ప్రశాంత పరిస్థితులు కల్పించే బాధ్యత అందరిపై నుండగలదని తెలుపుచున్నాము.

మశూచికి కొత్తమందు

త్వరలో భారతదేశములో ప్రయోగాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11

మశూచికవ్యాధి నివారణకు కొత్తగా కనిపెట్టిన "కాంపౌండ్ 49" మందును నెలా రెండునెలల్లో ప్రయోగంగా భారతదేశములో ఉపయోగించనున్నారు. ఈ మందును వాడగా ఇంతవరకూ కలిగిన ఫలితాలు బ్రిటిష్ శాస్త్రవేత్తలకు చాలా సంతోషం కలిగించినవి. లండన్‌లోని వెల్కమ్ ధర్మసంస్థ తాలూకు పరిశోధనాలయంలో తయారవుతున్నది ఈ మందు ఆసంస్థ నివేదిక ప్రకారం ఇంతవరకూ 13గురు రోగులకు ఈ కొత్తమందుతో చికిత్స చేశారు. భారతదేశం పాకిస్థాన్‌లలోని నిపుణుల సహకారంతో, అదేశాలలోని మశూచి వ్యాధిగ్రస్తులకు ఈ మందు వాడుతారు.

ఈమందునుగురించి ఇప్పుడే అతిగా ఆశలు పెట్టుకోడం మంచిదికాదు. మందు ప్రయోజనం నిష్కర్షగా తేల్పడానికి ఇంకా కొంతకాలం పడుతుంది అన్నారు వెల్కమ్‌సంస్థ ప్రతినిధికరు.

.....

భారతదేశములో 1961-62 లో 5,10 లక్షల టన్నుల వరి

న్యూఢిల్లీ, ఫిబ్ర 11

కొన్ని దేశాలలో ఋతుమానపరిస్థితులు అంత అనుకూలముగా లేకపోయినా 1961-62లో ఆసియా దేశాలలో మొదట అనుకున్నదానికంటే చాలా ఎక్కువ వరి పండేసూచనలు వచ్చినవని లండన్‌లోని కామన్‌వెల్త్ ఆర్థికసంఘం ప్రకటించింది.

భారతదేశములో 5,10,00,000 లటన్నుల వరి (3,50,00,000 లటన్నుల బియ్యం) ఈ యేడు పండినట్టు భారత వ్యవసాయమంత్రి అంచనా కిందటి సంవత్సరంకంటే 1961 లో ఎగుమతులు కొంచెం ఎక్కువగానే జరిగినవి కామన్వెల్త్‌లో బియ్యం ఎక్కువగా ఎగుమతిచేసినదేశాలు- పాకిస్థాన్, ఆస్ట్రేలియా, బ్రిటిష్ గయానా.

మన వైతాళికులు గురజాడ, కందుకూరి, గిడుగు

వీరికి ఆంధ్రప్రజ ఎంతో ఋణపడి ఉన్నదని శ్రీ పడ్లమూడి ప్రసంగం

హైదరాబాద్, ఫిబ్రవరి 11

"మహాకవి గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా అనే దేశభక్తి గేయం ప్రపంచ జాతీయ గీతంగా రూపొందవలసి నటువంటిది. గురజాడ యీ గేయాన్ని రచించడానికి కొంచెం పూర్వం ప్రసిద్ధమైన గేయాలు మూడు మన భారతదేశంలో అవతరించాయి. అవి నేడు మనకు జాతీయ గీతంగా ఉన్న జనగణమన- వందేమాతరం-సమోహిం దుమాత, గేయాలు. యీమూడింటిలోనుగూడా భారత భూ సంబంధమైన వర్ణనలుతప్ప మరేమీ లేవు. యీ గేయాలు మూడూ కూడా దేశభక్తి చిహ్నాలు కావనీ, ప్రబోధకాలుకూడా కావనీ, దేశమంటే సస్యశ్యామలత, నదులు, కొండలు, తాజ్ మహాలు, కోహినూరు మొదలైనవి కావనీ, దేశమంటే మనుషులేనని, మట్టికాదని వివరిస్తూ అసలు దేశ భక్తి ప్రతిబింబంగా గురజాడ వారు యీ గేయాన్ని రచించారు. ఆ మూడు గేయాలవల్ల గలిగిన అసంతృప్తి ఫలితంగానే గురజాడ యీ గేయాన్ని రచించాడన్న సంగతి మన దేశంలో ముగ్గురు, నలుగురికితప్ప ఎక్కువ మందికి తెలియదు" అని వాఙ్మయ మహాధ్యక్ష శ్రీ పడ్లమూడి గోపాలకృష్ణయ్య ఈ నెల 6 వ తేదీన ఇక్కడ నానక్‌రాం భగవాన్ దాను కళాశాలలో గురజాడ శతతమ జయంతి సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ అన్నారు. ఈ సందర్భంలో జరిగిన సభకు మహాకవి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. తొలుత వాఙ్మయ మహాధ్యక్షులు మాట్లాడుతూ గురజాడ గురించి అనేకమైన నూతన విషయాలు తెలియజేశారు. ఈ సందర్భంలో గోపాలకృష్ణయ్యగారు ఇంకా యీ క్రింది విధంగా నుడాడారు. "మనలో మంచి నశిస్తే, మానవత్వం నశిస్తే, సస్యశ్యామలతగానీ, నదులు, కొండలుగానీ, తాజ్ మహాలు కోహినూర్లుగానీ, మనల్ని ఉద్ధరించలేవు. కాబట్టి మన మానవత్వాన్ని, మంచిని రక్షించుకోవాలి, పెంపొందించుకోవాలి అన్నది గురజాడ భావం. యీ మానవత్వం ఒక భారతదేశానికి మాత్రమే సంబంధించింది కాదు, అఖిల ప్రపంచానికి సంబంధించింది. నిజానికి ప్రతి మానవునిలోను దేశభక్తిని రేకెత్తించగల, ఉద్బోధించగల గేయం మన గురజాడ గేయం. నిజంగా వసుధైక ప్రభుత్వమంటూ ఎప్పుడైనా ఏర్పడితే ఆ ప్రపంచ ప్రభుత్వ జాతీయ గీతంగా వెలుగొందడానికి కూడా అర్హమైనది మన గురజాడ గేయం. ఇంతటి మహోన్నతభావాలు విశ్వవ్యాప్తమైన దృక్పథము ఉన్నవారు గురజాడ. రకరకాల సంస్కృతి భావాలుగల వ్యక్తులు ఆయన్ని కవి అని, ఆకవి యని దూషిస్తున్నారంటే దాన్ని వారి ఖర్మంగా మనం భావించాలి.

గురజాడ అప్పారావుగారి పేరెత్తే సరికి దేశభక్తి గేయం, పూర్ణమ్మ కథ, కన్యాశుల్కం నాటకంతప్ప మనదేశ ప్రజలకు మరోటి గుర్తుకురాదు. ఆయన ఒక రచయితగానే దేశంలో వెలుగొందుతున్నారు. గురజాడ గొప్ప భాషావేత్త. ఆనాడు వ్యావహారిక భాషోద్యమంలో గిడుగు రామ్మూర్తి పంతులుగారు అతి ప్రముఖమైన పాత్ర వహించారు. ఆ పాత్రకు వెనుక అందరికీ తెలియకుండా ఉన్న గురజాడ వారి పాత్ర ఎంతో ఉన్నది. వ్యావహారిక భాషలో ఒక నియమం ఉన్నదని, శబ్ద స్థితి, ధాతువర్గ స్థితి, సూత్రబద్ధాలుగా ఉన్నాయని నిరూపిస్తూ ఇంగ్లీషులో ఒక గ్రంథం వ్రాశారు. అది 19 వ శతాబ్దం చివర వావిళ్ల వారిచేత ముద్రించబడింది. అది తెలుగులోకి రాకపోవడం మన దురదృష్టం. ఆంధ్ర సాహిత్యానికి ఒక రూపంగా ఎనలేని సేవచేసిన వావిళ్ళ వారు, మరో రూపంగా చాలా అన్యాయాలు చేశారు. ఆప్పకవీయాన్ని గిడుగువారిని పరిష్కరించి ఇవ్వమంటే, కాళపుత్ర పత్రికలలో వచనాలన్నీ వ్యావహారికంలో ఉన్నాయి. ఉన్నదున్నట్లు ముద్రించడానికి మీరు అంగీకరిస్తే తాము పుస్తకాన్ని ఉచితంగా ముద్రిస్తామన్నారు. గిడుగువారు పెట్టిన షరతును ఆమోదించి, 500 ప్రతులు మాత్రం ఉన్నదున్నట్లుగా చూపించి వాటిని గిడుగు వారికిచ్చితక్కిన ప్రతులన్నింటినీ వ్యావహారికాన్ని గ్రాంథికంగామార్చి ముద్రించి తాముఅమ్ముకున్నారు. గ్రాంథికవచనాలతో ఉన్న గ్రంథాన్ని చూచిన కొందరు గిడుగువారిని ఆక్షేపించారు. అప్పుడుగాని యీ రహస్యం గిడుగు వారికి తెలియలేదు. అట్లాగే వ్యావహారిక భాష అంటే ఇష్టంలేని వావిళ్ళ వారు గురజాడ వారు ఇంగ్లీషులో వ్రాసిన పుస్తకాన్ని అచ్చుపేసి మంచి పనిచేసినా, నల్లరికీ తెలియకుండా చేశారు. ఏమైనా పుస్తకాలు బయటికొచ్చాయంటే గురజాడ వారి ద్వారానే వచ్చాయి. భాషా విషయంలో మన విశ్వవిద్యాలయాలు బండిని ముందుపెట్టి గుర్రాన్ని వెనకాలఉంచి నడిపించాలని ప్రయత్నం చేస్తున్నట్లు వ్యవహరిస్తున్నాయి. గురజాడవారు బ్రతికియుండగా ఆయన్ని ఎంతగానో గౌరవించిన మద్రాసు విశ్వవిద్యాలయంవారు వ్యావహారిక భాషను ఆమోదించారు. విద్యార్థులు వ్యావహారికంవ్రాయవచ్చునని అంగీకరించారు. ఈ రూపంగా గురుజాడ వారు బ్రతికి ఉన్నంతకాలమాత్ర ఇంతలేనివారికి కష్టంగా ఉన్నా మద్రాసు విశ్వవిద్యాలయంలో వ్యావహారికం చెల్లుబాటయింది. అప్పారావుగారు కీర్తిశేషులైన తర్వాత ఏరుదాటి తెప్ప తగలవేసినట్టు తిరిగి వ్యావహారికాన్ని తోసిపుచ్చి గ్రాంథికాన్ని ప్రవేశపెట్టారు. అన్ని గుర్రాల్లాగానే మన విశ్వవిద్యాలయ గుర్రాలు ముందుకు వచ్చి బండిని ఎప్పుడు లాగుతాయో తెలియదు. మహాకవి, ప్రముఖ భాషావేత్త అయిన గురజాడవారు ఇంగ్లీషులో వ్రాసిన ఆ భాషా విషయకమైన గ్రంథాన్ని ఇప్పటికైనా తెలుగులోకి అనువదింపించి ముద్రించడం అవసరం. దురదృష్టవశాత్తు ప్రముఖ సంస్కర్తలైన గిడుగు, గురజాడ, కందుకూరులను లేనిపోని రాజకీయ భావాలను కొన్ని శక్తులు ఇటీవల వ్యాపింపచేశాయి. సంఘ సంస్కరణలో భాషా సంస్కరణలో ప్రముఖ పాత్ర వహించిన యీ ముగ్గురికి ఆనాడు ఏ విధమైన రాజకీయ భావాలూలేవు, అయినా వారు ఏదో ఒక రాజకీయ పార్టీకి చెందినవారన్నట్టు దేశంలో ఒక విధమైన భావం ఏర్పడడానికి అనుకూలమైన వాతావరణాన్ని కొందరు కల్పించారు. తెలిసినవారెవ్వరూ దీనిని హర్షించలేరు. నిజానికి వారికి ఏమీ రాజకీయ భావాలులేవు. ఈనాడే వారు సజీవులై ఉంటే స్వాతంత్ర్య ప్రియులై, సంఘ సంస్కరణాభిలాషులై మహోద్యమాలను కొనసాగించిన వారు నియంతృత్వ శక్తులకు దాసోహం అంటారనడం కల్ల. ఆకారణముగా దేశంలో వ్యాపించిన యీ దుర్భావాన్ని తొలగించడంలో మన కందరికీ బాధ్యత ఉన్నది. గురజాడ, కందుకూరుల జయంత్యుత్సవాలు జరపాలని ఆంధ్ర ప్రభుత్వంవారు నిర్ణయించి ఒక కమిటీని వేసినందుకు మనం అందరం ప్రభుత్వానికి కృతజ్ఞత చెప్పవలసి ఉన్నది. ఈ విషయంలో శ్రద్ధవహించిన ముఖ్యమంత్రి సంజీవయ్యగారికి, విద్యామంత్రి పట్టాభిరామారావుగారికి నా హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నాను. సముచితమైన యీ నిర్ణయం చేసినందుకు సాహిత్య వేత్తలందరూ హర్షిస్తారు. గురజాడ శతతమజయంతి ఉత్సవాల కార్యక్రమ నిర్వహణకు యీవేదికమీద ఉన్న శ్రీ బోయి భీమన్న గారు అధ్యక్షులుగా ఉపసంఘాన్ని వేశారు. ఇంగ్లీషులో వెలువడిన భాషా గ్రంథాన్ని తెలుగులో ప్రచురించే ఏర్పాట్లు చేయవలసిందిగా నేను ఇక్కడినుంచే భీమన్న గారిని కోరుతున్నాను. గురుజాడ, కందుకూరుల బొమ్మలతో పోస్టు స్టాంపులు ముద్రించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరవలసిఉన్నది. ఈ విషయంలో భీమన్న గారు తదితర పెద్దలందరూ ఏకమత్యంగా కృషిచేయాలని కోరుతున్నాను. ఈ 62 లోనే మరొక మహావ్యక్తి శతవర్ష వర్ధంతి ఉత్సవాలు జరుపుకొనవలసిన అవసరం మన దేశానికి ఉన్నది. వ్యావహారిక భాషా వాదానికి, సంఘ సంస్కరణ ఉద్యమానికి మూల పురుషుడయిన మహావ్యక్తి పండిత ప్రకాండుడు శ్రీ స్వామి నేని ముద్దు నరసింహంగారి శత వర్ష వర్ధంతి సంవత్సరం యీ సంవత్సరమే. ముద్దుస్వామిగారు వ్యావహారిక భాషా వాదానికి బీజాన్ని ప్రవేశపెడమేగాక హితసూచని గ్రంథ రచన ద్వారా బాల్య వివాహాలను చేయరాదని, వితంతు వివాహాలు చేయవచ్చునని అనేక విషయాలు నిరూపించారు.

ఈ పుస్తకం 1862 లో అచ్చు అయింది. యీ గ్రంథంలోని విషయాలు అంతకుముందు వ్యాస రూపాలలో ప్రచురితంకాగా అనేక మంది మార్తాండులైన పెద్దలతో బంధువులతోను విరోధం తెచ్చుకున్నారు. వీరేశలింగంగారికంటే ఎక్కువగా ఇబ్బందులకు లోనైయ్యారు. వీరి "హిత సూచని"లో శాస్త్రబద్ధంగా నిరూపితాలయిన విషయాలను ఆధారం చేసుకొని సంఘసంస్కరణలో వీరేశలింగంగారు విజృంభించారు. మంత్ర తంత్రాలు లేవని, దేవుళ్లు లేరని, అధునాతన యుగంలో మొదట వాదించినవారు సామినేని వారే. భాషా విషయకంగా స్వేచ్ఛాదు, భావ విషయకంగానే కాదు, సాంఘికంగా కూడా విప్లవం తీసుకరావాలన్న మూడు ఉద్యమాలకు మూల పురుషుడైన ముద్దు నరసింహం శతవర్ష వర్ధంతిని మనం జరుపుకోవలసిఉన్నది. ప్రభుత్వం ఇతర పెద్దలు యీ విషయంలో సముచితమైన నిర్ణయంచేసి ఉత్సవాలు జరుపుతారని ఆశిస్తున్నాను అని గోపాలకృష్ణయ్యగారు తమ ఉపన్యాసం ముగించారు.

అనంతరం శ్రీ బోయి భీమన్న గారు మాట్లాడుతూ గురజాడ అప్పారావు మహాకవి అనడానికి దేశ భక్తి గేయం ఒక్కటే చాలునని ఇతర దేశాలలో రచయితలకు జరుగుతున్న ప్రపంచ వ్యాప్తమైన ప్రచారం ఆంధ్ర దేశంలో జరగడంలేదని, యీ విషయంలో మనం శ్రద్ధవహించ

సెంట్రల్ రైల్వే

టెండర్ నోటీసు

నెం. 50/2/1962/కేటరింగ్/కాజీపేట జంక్షన్/7

సికింద్రాబాద్‌లోని డివిజనల్ సూపరింటెండెంట్ (కేటరింగ్) కార్యాలయంలో సెట్టు ఒక్కంటికి రు. 2/- చొప్పున చెల్లిస్తే లభించే నిర్ణీత టెండర్ ఫారాలపై యూనిఫారంలు ఉతుకుటకు, ఈ దిగువ వస్తువులు ఆరు నెలలపాటు 1-4-62 నుండి కాజీపేట స్టేషన్ కేటరింగ్ యూనిట్‌కు సప్లయి చేయుటకు టెండర్లు కోరబడుతున్నది. 1-4-62 నుండి 3 నెలలు మాత్రం ఉల్లిపాయలు ఆలుగడ్డలు సప్లయి చేయనక్కరలేదు

వివరణ	కాంట్రాక్టు దామాషా విలువ
1. ముడిదినుసులు (బియ్యం, పప్పులు వగైరా)	రు 37000/-
2. శాకేతర వస్తువులు (గుడ్లు, చేపలు, కోళ్ళు, మాంసం)	రు. 7000/-
3. బేకరీ వస్తువులు (బ్రెడ్, బన్, నాన్ కతై వగైరా)	రు. 6000/-
4. చార్‌కోల్, వంటచెరకు	రు. 4000/-
5. పాలు, పెరుగు	రు 12000/-
6. రిఫైన్డ్ వేరుసెనగనూనె	రు. 2500/-
7. శుద్ధమైన వెన్న (ఉప్పుకలపని తెల్లని వెన్న నేయిగా వాడతానికి)	రు. 3000/-
8. పాన్ దినుసులు (వక్కలు, తములపాకులు, జర్దా వగైరా)	రు. 6000/-
9. ఉల్లిపాయలు, ఆలుగడ్డలు	రు. 2500/-

టెండర్ ఫారాలు పోస్టుద్వారా తెప్పించుకొనేవారు తాము ఏ అంశంకోసం ఫారం కోరుతున్నారో స్పష్టపరుస్తూ పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి. సీల్డు కవరులో టెండర్లను నమూనాలతోసహా 3 సెట్లుగా అందజేయాలి. టెండర్లు చేరవలసిన ఆఖరు తేది. 1962 ఫిబ్రవరి 23వ తేదీ సాయంత్రం 3 గంటలు టెండర్లు ఆ రోజునే 3-15 లకు విప్పుతారు. టెండర్లను 2 గంటల వరకూ ఏ పని రోజునైనా 22-2-1962 వరకూ ఇస్తారు. ధరావతుధనం డివిజనల్ పే మాస్టర్ సికింద్రాబాద్ వారు 22-2-1962 నాడు 3 గంటల వరకూ తీసుకుంటారు.

స్థాపితం 1920

రెడ్డి అండ్ కో, రిజిష్టర్డ్

గోపాలపురం. తూ॥గో॥ జిల్లా

కుష్ఠు బాల్మి మేహపొడ

శాస్త్రీయ

వగైరా చర్మ, సుఖ, స్త్రీల కుసుమ వ్యాధులకు గ్యారంటీ చికిత్స

ఆయుర్వేద ఔషధములు లభించును.

REDDY & CO. (REGD) GOPALAPURAM E.G. Dt. (AP)

కేటలాగు సలహా ఉచితము.

మా బ్రాంచి ఆఫీసు: 3560, కింగ్స్‌వే, సికింద్రాబాద్.

సెంట్రల్ రైల్వే

టెండర్ నోటీసు

నెం. 49/2/1962/ కేటరింగ్/ సికింద్రాబాద్/35.

సికింద్రాబాద్‌లోని డివిజనల్ సూపరింటెండెంట్ (కేటరింగ్) కార్యాలయంలో స్వయంగా వచ్చిగాని పోస్టుద్వారాగాని సెట్టుకు రు. 2 చెల్లించి పొందగల నిర్ణీత టెండర్ ఫారాలపై యూనిఫారములు ఆతుకుటకు ఈ దిగువ వస్తువుల్ని 1-4-62 నుండి ఆరు నెలల వరకు సికింద్రాబాద్ స్టేషన్‌కు సప్లయి చేయడానికి టెండర్లు కోరబడుతున్నవి. ఉల్లిపాయలు, ఆలుగడ్డలు 3 నెల వరకు సప్లయి చేయనక్కరలేదు.

వివరణ	కంట్రాక్టు దామాషా విలువ
1. ముడి దినుసులు (బియ్యం, పప్పులు వగైరా)	రు 35000/-
2. శాకేతర దినుసులు (గుడ్లు, చేపలు, కోళ్ళు, మాంసం)	రు 15000/-
3. టిన్ దినుసులు	రు 3000/-
4 బ్రెడ్	రు 5000/-
5. చార్‌కోల్	రు 10000/-
6. పాలు, పెరుగు	రు 3000/-
7. పరిశుద్ధమైన వెన్న (ఉప్పుకలపని తెల్లని వెన్న నేయిగా వాడతానికి)	రు 6000/-
8. రిఫైన్డ్ వేరుసెనగనూనె	రు 5000/-
9. ఉల్లిపాయలు, ఆలుగడ్డలు	రు 2500/-

టెండర్ ఫారాలు పోస్టుద్వారా తెప్పించుకొనేవారు తాము ఏ అంశంకోసం ఫారం కోరుతున్నారో స్పష్టపరుస్తూ పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి. సీల్డు కవరులో టెండర్లను నమూనాలతోసహా 3 సెట్లుగా అందజేయాలి. టెండర్లు చేరవలసిన ఆఖరు తేది 1962 ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలు. టెండర్లు ఆ రోజునే 3-15 లకు విప్పుతారు. టెండర్లను 2 గంటల వరకూ ఏ పని రోజునైనా 19-2-62 వరకు ఇస్తారు. ధరావతుధనం డివిజనల్ పే మాస్టర్ సికింద్రాబాద్ వారు 19-2-1962 నాడు 3 గంటల వరకూ తీసుకుంటారు.

ఆకాశవాణి

హైద్రాబాదు-ఎ

405.4 మీ (740 కిలోసై)

మంగళవారం ఫిబ్రవరి 13

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-35 భక్తి రంజని (విజయవాడ నుండి రిలే), 6-55 కార్యక్రమవివరణ, 7-00 తె-వా, 7-15 సంగీత శిక్షణ, 7-30 విజయవాడ వలె, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 అంథానీ మాత్యూస్: వయొలిన్, 8-45 ప్రసారసమాప్తి.

మ॥ 11-40 ఉన్నత పాఠశాలలకు, 12-10 ఉన్నత పాఠశాలలకు (ఉర్దూ), 12-30 కార్మికుల కార్యక్రమము, 1-00 జీనత్ బేగం: ఘజల్, 1-15 సుబద్ధ సంగీత్, 1-30 వాద్యగోష్ఠి, 1-50 తె-వా, 2-00 హైద్రాబాద్ వి వలె, 2-10 ఉ-వా, 2-20 హైద్రాబాద్ వి వ లె, 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 సాహిత్య నందిని (విజయవాడ నుండి రిలే), 6-30 నగరవాణి, 7-00 తె-వా, 7-15 మరాటి శ్రోతలకు, 7-30 ఆటల డైరీ (ఉర్దూ) ఎస్. ఎం. జిలానీ, 7-45 రేడియో వార్తా వాహిని, 7-55 విరామ సంగీతం, 8-00 ప్రసంగం (హిందీ), 8-10 విరామ సంగీతం, 8-15 శ్రోతల ఉత్తరాలకు జవాబులు, 8-25 విరామ సంగీతం, 8-30 వి.వి. నీలారాయ్: వీణ, 9-00 ఆం-వా, 9-15 ఉ-వా, 9-30 నాటి హైదరాబాద్ సంగీత రూపకం (శ్రీమతి సరోజిని నాయుడు పద్మముల నాధారంగాగొని) రచన: దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి, 9-45 రేడియో సంక్షిప్తశబ్దచిత్రము, 10-45 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైద్రాబాద్-బి

60.12 మీ (4990 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎ వలె, 7-45 ప్రసార సమాప్తి.

ప్రసారము 1 (తరువాయి)

49.02 మీ (6120 కిలోసై)

8-00 హైద్రాబాద్ ఎ వలె 8-45 ప్రసార సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

మ॥ 11-40 హైదరాబాద్ ఎ వలె, 12-10 గాత్ర కదంబం, 12-30 హైద్రాబాద్ ఎ వలె, 2-00 వి. వి. నీలారాయ్: వీణ, 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥ 6-00 హైద్రాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-45 హైదరాబాద్ ఎ వలె, 8-00 లయ చిత్రం: చతురశ్రత్రిపుట, 8-15 హైదరాబాద్ ఎ వలె, 9-15 నాదస్వరం, 9-30 హైదరాబాద్ ఎ వలె, 10-45 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, 6-35 భక్తి రంజని సుబ్రహ్మణ్యభుజంగం. ముకుందమాల శ్లోకాలు. 6-55 ప్రసార తరంగిణి, 7-00 తె వా, 7-15 సంగీతశిక్షణ 7-30 శిష్టుపర్వశాస్త్రి: వయొలిన్. 8-00 ఆం-వా, 8-15 హిం వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 11-30 రాష్ట్ర గానం. 11-40 ఉన్నత పాఠశాలలకు (హైదరాబాద్ నుండి రిలే), 12-10 లలితసంగీతం. 12-30 కార్మికుల కార్యక్రమము (హైదరాబాదు నుండి రిలే), 1-00 పేరటం స్త్రీల కార్యక్రమం బంగారు వాకిలి సంగీత రూపకం, 1-30 లలిత సంగీతం, 1-50 తె-వా, 2.00 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 సాహిత్య నందిని, 6-30 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-45 రేడియో బాత్రాహిని (హైదరాబాదు నుండి రిలే), 8-00 శిష్టుపర్వశాస్త్రి: వయొలిన్, 8-30 ఉభయ కుశలోపరి శ్రోతల ఉత్తరాల జవాబులు, 8-45 ఫిల్మ్ సంగీతం, 9-00 ఆం-వా, 9-15 గానసుధ, 9-30 హైదరాబాదు ఎ వలె, 9-45 రేడియో సంక్షిప్త శబ్దచిత్రము (హైద్రాబాదు నుండి రిలే), 10-45 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

వస్త్రాలపై 16 రంగులు ముద్రించే యంత్రం

లండన్, ఫిబ్రవరి 11

వస్త్రాలకు 16 రంగులు అద్దకము వేసే యంత్రమును లాంక్‌షైర్ లోని ఒక సంస్థ తయారు చేసినది. రెండు యూనిట్లుంటవి. ఒక్కొక్క వైపున ఎనిమిది రంగులు లేదా ఒకే వైపున 16 రంగులు అద్దకం చేయడానికి ఉపయోగపడుతుంది ఈ యంత్రము ఒక్కొక్క యూనిట్‌కు 8 అడుగుల వ్యాసము 5 అడుగుల 3 అంగుళాల వెడల్పు పళ్ళెంవంటి పరికరం ఒకటి ఉంటుంది-4 అడుగుల 8 అంగుళాల పొడవు వస్త్రాలకైనా ఈ యంత్రం మీద రంగులు ముద్రించవచ్చు.

జాతీయ సమైక్యతపై నాటకం

రు 4 వేల బహుమతి ఇచ్చుటకు నిర్ణయం

హైద్రాబాద్, ఫిబ్ర 11

కేంద్ర ప్రభుత్వ వైజ్ఞానిక పరిశోధన మరియు సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ రూ 4వేలబహుమతి గల ఒక బహుమతిని ఒకటవ ఏప్రిల్ 1961 పూర్వము ఇంగ్లీషు, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, మళయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, తమిళం, తెలుగు మరియు ఉర్దూ భాషలలో వ్రాయబడిన ఉత్తమ నాటకము ఒక్కొక్కదానికి ఇవ్వ నిశ్చయించినది. ఈరచనలు 28 వ ఫిబ్రవరి 1962 లోపల పై మంత్రిత్వ శాఖకు అందజేయవలసి ఉంటుంది.

"భారత దేశ ఐక్యముకై అన్వేషణ"అను అంశంపై ఈ నాటకము రచించబడి 3గంటల సమయముపాటు ప్రదర్శింపదగినదై ఉండాలి.

ముద్రించబడినదిగాని, ఒకేవైపున వ్రాయబడిన వ్రాతప్రతిగాని ఈ నుంత్రాంగానికి పంపాలి.

కామ్దానీ, జర్దోజీ కార్మికుల ప్రతినిధి వర్గం

హైద్రాబాద్, ఫిబ్రవరి 11

కామ్దానీ, జర్దోజీ కార్మికుల ప్రతినిధి వర్గం ఒకటి వాణిజ్య, పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీ నరసింహారావును కలిసి కార్మికుల ఆర్థిక పరిస్థితులను గూర్చి వివరించింది.

ఈపరిశ్రమలో పనిచేయుచున్న వ్యక్తిగత సంస్థలకు అవసరమగు ఋణాలిచ్చి అవి కార్మికుల సంక్షేమానికి తోడ్పడునట్లు చేయాలని ప్రతినిధి వర్గం అభ్యర్థించింది.

బేగంపేట విమానాశ్రయంలో అమెరికా అధికారులు జార్జిమెక్ గవరన్, ఆర్థర్ ఎం ష్లెసింజర్లకు 9వ తేదీన స్వాగతమివ్వబడినప్పటి దృశ్యం. ఈ ఇరువురు అమెరికన్ అధికారులూ 11వ తేదీ మధ్యాహ్నం హైద్రాబాద్ నుండి మద్రాసుకు వెళ్ళారు.

గ్రామ వార్తలు

నూతనకల్లు పాఠశాలలో స్వపరిపాలన

నూతనకల్లు, ఫిబ్రవరి 11

నూతనకల్లు (నల్లగొండజిల్లా) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులచే గత నెల 30న "స్వపరిపాలనదినోత్సవము" జరుపబడినది. విద్యార్థి సమితి "ప్రెసిడెంటు" వై. మధుసూదన్ రెడ్డి (9) జిల్లా పరిషత్ చైర్మన్ గను, కార్యదర్శి యన్. సాయిరెడ్డి ప్రధానోపాధ్యాయుడుగను (10) ఎ రాజయ్య, (11) జిల్లా విద్యాశాఖాధికారిగాను వ్యవహరించారు. ఈకార్యక్రమము స్థానిక అధికార ప్రముఖుల సమక్షమున జయప్రదముగా నిర్వహింపబడినది. న్యాయ నిర్ణేతలు దిగువ విద్యార్థులను బహుమానులుగా నిర్ణయించిరి.

కార్య నిర్వాహకులలో వై. మధుసూదన్ రెడ్డి (9) ప్రథమ బహుమతి, యన్. సాయిరెడ్డి (10) ద్వితీయ బహుమతి అధ్యాపకుల్లో బి.మల్లయ్య (11) ప్రథమ బహుమతి' ఎస్. రామిరెడ్డి (10) ద్వితీయ బహుమతి ప్రాథమిక పాఠశాల అధ్యాపకులలో జే.ఎస్ వాగం (6) ప్రథమ బహుమతి కె. కుమారస్వామి (7) ద్వితీయబహుమతిని పొందినారు.

పనివారలలో మౌలానా(8) ప్రథమ బహుమతి. సి. హెచ్. సోమిరెడ్డి (7) ద్వితీయ బహుమతిని పొందినారు.

పాఠశాల సమయమైపోగానే అనాటి ప్రధానోపాధ్యాయుడు పరిషత్ చైర్మన్‌కు, జిల్లా విద్యాశాఖాధికారికి పాఠశాల అధ్యాపక వర్గానికీ, పుర ప్రముఖులకు అనాటి ఉపాధ్యాయులను పరిచయముచేయడముతో అనాటి కార్యక్రమము సమాప్తమయినది.

మేడారం నియోజక వర్గంలో మంత్రి శ్రీరామచంద్రారెడ్డి పర్యటన

మేడారం, ఫిబ్రవరి 11

రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి యీ నెల 7వ తేదీన మేడారం నియోజక వర్గంలోని గొల్లపల్లి, ఎండపల్లి సెగ్యాన, జూలపల్లి మొదలగు గ్రామములు పర్యటించారు. ఈ నియోజక వర్గంలో శ్రీ పి శంకరయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు. శ్రీ రామచంద్రారెడ్డి రానున్న ఎన్నికల ప్రాముఖ్యమును వివరిస్తూ, ఇంతవరకు కాంగ్రెస్ దేశానికిచేసిన అమూల్యమైన సేవలను, దానిఅవసరములనువివరిస్తూ, ప్రజలందరు కాంగ్రెస్‌కే తమఓటును వేయవలసినదని అభ్యర్థించారు, ఈ గ్రామములలోని బహిరంగ సభలకు వేలకొలది ప్రజలు హాజరైనారు.

పెద్దదిన్నె గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవం

మహబూబ్ నగర్, ఫిబ్రవరి 11

ఆలంపూర్ తాలూకా పెద్దదిన్నె గ్రామంలో గత నెల 15వ తేదీ నుంచి 19వ తేదీవరకు శ్రీవేంకటేశ్వరస్వామి వారి జాతర జరిగింది ఈ గ్రామం యీ జిల్లాలోని మనోపాల్ బ్లాక్‌కు చెందినది. జాతర సందర్భంలో రథోత్సవం, ఎగ్జిబిషను నిర్వహించబడినవి

8 నెలలనుండి జీతాలులేని మెట్పల్లి పురపాలక సంఘ కార్మికులు

కోరుట్ల ఫిబ్రవరి 11

కరీంనగరము జిల్లా మెట్పల్లి పురపాలక సంఘ కార్మికులు నవంబరు 1961నుండి మూడు నెలల జీతాలులేక నానాఅవస్థలకు గురియగుచున్నారు. కార్మికులు తమ గోడును పురపాలక సంఘాధ్యక్షులకు మనవి చేసుకొన్నా చెవిని పెట్టడములేదు. పైఅధికారులు కల్పించుకొని మొత్తము మూడు నెలల జీతాలు వెంటనే యిప్పించాలని మునిసిపల్ మరియు రోడ్ గ్యాంగ్ వర్కర్స్ యూనియను జగిత్యాల పాంతీయ కమిటీ కార్యదర్శి శ్రీ ప్రభాకర్ ఒక విజ్ఞప్తిచేశారు.

భారత్పూర్‌లో పరిస్థితి

అదుపులోకి వచ్చిందని డా॥ తుల్సీగిరి

ఖట్మండు, ఫిబ్రవరి 11

భారత్పూర్‌లో పరిస్థితి అదుపులోకివచ్చిందని నేపాలు దేశీయ, విదేశీయ మంత్రి డా॥ తుల్సీగిరి గతరాత్రి ఇచట తెలిపారు.

అల్లరుల సందర్భంగా 5,6 గురు గాయపడినారని, కొందరు అరెస్టు చేయబడినారని ఆయన చెప్పారు.

గత బుధవారం భారత్పూర్‌లో తిరుగుబాటు జరుగుటకు ఒక రోజు ముందు "మారి"లో అల్లరులు మొదలయ్యాయని, సమయానికి సైన్యం భారత్పూర్ చేరి పరిస్థితుల నదుపులోకి తెచ్చిందని డా॥తుల్సీగిరి అన్నారు.

పాల్పాజైలు నుండిపారిపోయిన ఖైదీలలో 4 గురి కాల్చివేత

గత దివాకరం దక్షిణనేపాలులోని పాల్పాజైలు నుండితప్పించుకపోయిన 100 మంది ఖైదీలలో 89గురి పోలీసు, సైనికయూనిట్లు తిరిగి పట్టులో గలిగాయి 4గురు ఖైదీలనుకాల్చివేయుట జరిగింది.

అష్టగ్రహ కూటమివల్ల ప్రపంచ అంతము జరుగనున్నదని కాపలాదార్లు భయపడి అజాగ్రత్తగా నున్నపుడు యీఖైదీలు జైలుమండిపలాయనం చిత్తగించారట.

ఖాట్మాండ్ పరిసరాలలో గుర్తుతెలియనివిమానాలవిహారం

ఖాట్మండు, ఫిబ్ర 11

కొన్ని గుర్తు తెలియని సైనిక విమానాలు ఖాట్మండుపై తిరుగుచున్నట్లు 28రోజులక్రితం అందినవార్తల వల్ల తెలుస్తున్నది.

నిజమైన విషయాలు తెలియకున్నను భారత్‌పూర్ దగ్గర ఇక్కడికి 60 మైళ్ళ దక్షిణానగల సిమ్రాలో ఈ సైనిక విమానాలు తిరుగుతున్నట్లు తెలుస్తున్నది

భారత్‌పూర్ ప్రాంతంలో క్లిష్టతరమైన పరిస్థితులు ఏర్పడుతున్నట్లు ఇక్కడికందిన అనధికార వార్తల ద్వారా తెలుస్తున్నది.

కర్ణాటక గాత్ర సంగీతపోటీ విజేతలు

విజయవాడ, ఫిబ్రవరి 11

జనవరి 25, 26, 27 తేదీలలో భారతీయ కళాసమితివారు విజయవాడలో త్యాగరాజ ఆరాధనోత్సవ సందర్భములో కర్ణాటక గాత్ర సంగీత పోటీలు నిర్వహించారు. దానిలో ప్రథమ శ్రేణి గాత్ర సంగీత పోటీలో ప్రథములుగా కుమారి నేతి ఇందిరాదేవి (విజయవాడ), ద్వితీయులుగా కుమారి భావరాజు సీతావసంతలక్ష్మి (రాజమండ్రి) తృతీయులుగావాగంటి త్రిలోచన (విజయవాడ) వారు గెలుపొందినారు

ద్వితీయ శ్రేణి గాత్ర సంగీత పోటీలో ప్రథములుగా కోలవల్లి వెంకట రమణకుమారి (రాజమండ్రి), ద్వితీయులుగా మట్లపూడి కోటిసూర్య విజయలక్ష్మి (విజయవాడ), తృతీయులుగా కుమారి శోభాకాచే (విజయవాడ) వారు గెలుపొందినారు.

పోటీలలో గెలుపొందిన వారికి శ్రీమతి సీతారామమ్మ (డి. ఇ. ఒ) గారు బహుమతులు పంచిపెట్టారు యీ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు సంగీత విద్యార్థులు పాల్గొన్నారు.

నలంద విద్యా మందిర్ సంస్థ

హైద్రాబాదు, ఫిబ్ర 11

శ్రీ ఠాకూర్ బిన్ దేవ్ సింగ్ అధ్యక్షతననలందవిద్యామందిర్ సంస్థపర్యాటు చేయబడినది. విద్యారంగంలో కృషి చేయుటమే యీసంస్థ ఆదర్శంగా పెట్టుకొన్నది.

నేటి రాత్రి

పద్మిని పిక్చర్స్ వారి:

గాలిమేడలు

తా॥ ఎన్. టి. రామారావు, దేవిక ఎస్. వి. రంగారావు, జగ్గయ్య, రమణారెడ్డి, బాలసరస్వతి, నాగయ్య, రాజబాబు, రమాప్రభ, కమలాకర్, మారి. ఎమ్. వి. రాజమ్మ

నిర్మాత దర్శకుడు: బి. ఆర్. పంతులు

సంగీతం: టి. జి. లింగప్ప

ప్రభాత్ - హైద్రాబాద్.

అలంకార్ - సికింద్రాబాద్.

ఆటలు: 3-00, 6-15, 9-30

రామా వరంగల్ మోహన్ నిజామాబాద్

—విజయ రిలీజ్.

1953 కంపెనీల చట్టపు 412 సెక్షన్ ప్రకారం

ప్రకటన

దివాన్ బహదూర్ రామ్‌గోపాల్ మిల్స్ లిమిటెడ్

ప్రస్తుతము మేనేజింగ్ ఏజన్సీ అగ్రిమెంటు తీసుకోబడినట్టి 1960/31 ఆర్థిక సంవత్సరంలో 1-7-1960 నుండి 15-8-1960 1½ మాసమునకు కంపెనీ మేనేజింగ్ ఏజంట్లకు ప్రతిఫలము రు. 4,500 చెల్లించుటకు ఆమోదమునకు 1956 కంపెనీల చట్టపు 329 సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వమునకు దరఖాస్తు తయారు చేయబడుచున్నదని ఇందుమూలమున తెలియజేయనైనది. పైన పేర్కొనబడిన ప్రతిఫలం డైరెక్టర్ల బోర్డుచే సిఫారసు చేయబడి కంపెనీ జనరల్ బాడీ సభ్యులచే మంజూరు అయి వున్నది.

పై దరఖాస్తుకు ఎవరికయిన ఎట్టి అభ్యంతరమువున్న యెడల అట్టి వారు సెక్రటరీ, కంపెనీ లా అడ్మినిస్ట్రేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీకి తెలియపరచవలెను మరియు కంపెనీకి కాపీ పంపించవలెను.

దివాన్ బహదూర్ రామ్‌గోపాల్ మిల్స్ లిమిటెడ్

తరపున

లక్ష్మీనారాయణ్ రామ్‌గోపాల్ అండ్ సన్ ప్రయివేట్ లిమిటెడ్.

ఏజంట్లు

(సం) గోపికిషన్ మురళీధర్

గవర్నింగ్ డైరెక్టర్

హైద్రాబాద్ (ఎ. పి)

తేది: 9-2-1962.

రేపటి రాత్రి

రేవమహత్తర సంయుక్త వారము

జగ్గయ్య సమర్పించుచున్న జాగృతి చిత్రా వారి

పదండి ముందుకు

తారాగణం:- జగ్గయ్య, జమున, గుమ్మడి, రమణారెడ్డి, నాగయ్య, శాంతారావు, కె. వి. ఎస్. శర్మ, సి. ఎస్. ఆర్, ఎస్. వి. రంగారావు, జి. వరలక్ష్మి, హేమలత, రాజసులోచన, కొత్తగా ప్రవేశపెట్టబడిన బాలనటుడు సురేష్, (హైద్రాబాద్ నుండి)

దర్శకత్వం: వి. మధుసూదన్ రావు.

సంగీతం: కోదండపాణి

సాగర్ హైద్రాబాదు ఆటలు: 2-30, 6-00, 9-30

చిత్రా సికింద్రాబాద్. ఆటలు: 6-00, 9-30.

లక్ష్మి వరంగల్, ప్రభాత్- ఖమ్మం.

—వాణి ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.

14 వ సంయుక్త వారం

అన్న పూర్ణా వారి:

ఇద్దరు మిత్రులు

నిర్మాత: డి. మధుసూదనరావు బి. ఎ.

దీపక్ మహల్ హైద్రాబాద్. ఆటలు: 2-30, 6-00, 9-30 గం॥

రాజేశ్వర్ సికింద్రాబాద్. ఆటలు. 6-00, 9.30.

మరియు శ్రీనివాస్- వరంగల్.

—నవయుగ రిలీజ్

నేటి రాత్రి నేటి రాత్రి

బుద్ధా పిక్చర్స్

పాప పరిహారం

(తెలుగు)

తా॥ శివాజీగణేశన్, పద్మినీగణేశన్, నాగయ్య, టి. ఎస్. బాలయ్య

ప్యారడైజ్ సికింద్రాబాద్ ప్రతిరోజు 2 ఆటలు: 6-15 మరియు 9-30.

కమల్ హైద్రాబాద్

డిస్ట్రిబ్యూటర్స్: కర్ణాటక్ ఫిలిమ్స్ లిమిటెడ్, సికింద్రాబాద్.



ఉచితం

సుందరమైన స్త్రీల చేతిరుమాల వాడుటకు

ఆహ్లాదకరమైన సబ్బు, మాయా

నాలుగు బిళ్లలు కొన్నప్పుడు

స్వస్తిక్ ఆయిల్ మిల్స్ లిమిటెడ్

హైద్రాబాద్ మార్కెట్ కమిటీ వ్యాపార ప్రతినిధుల ఎన్నిక

ప్రకటన

హైద్రాబాద్ అగ్రికల్చరల్ మార్కెట్స్ చట్టం (1950 వరకు సవరించబడినది) (4)వ సెక్షన్ ప్రకారం హైద్రాబాద్ మార్కెట్ కమిటి ప్రాంతంనుండి వ్యాపార ప్రతినిధుల ఎన్నుకొనుటకు ఎన్నిక 12-3-1962న నిర్వహించబడునని ఇందుమూలమున తెలుపనైనది.

ఎన్నిక నిమిత్తం హైద్రాబాద్ మార్కెట్ ప్రాంతమును 3 నియోజకవర్గములుగా విభజించబడి వాటినుండి దిగువ ప్రకారం 6 గురు వ్యాపారులను ఎన్నుకోబడును.

నియోజకవర్గపు పేరు	సంఖ్య	సీట్లసంఖ్య	నియోజకవర్గపు ప్రాంతం
(1) హైద్రాబాద్	3		చాంద్రాయణగుట్ట మినహాయించి హైద్రాబాద్ మున్సిపల్ ప్రాంతం.
(2) సికింద్రాబాద్	2		సికింద్రాబాద్ మున్సిపల్ ప్రాంతం
(3) చాంద్రాయణగుట్ట	1		సెం. (1) ప్రాంతము మరియు సర్వే నెం. 895 మినహా హైద్రాబాద్ మున్సిపల్ ప్రాంతం.

రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలను దిగువ పద్ధతిలో నిర్వహించబడును:-

24-2-1962 సా॥ 3-00 గంటలలోపు 1950 హైద్రాబాద్ అగ్రికల్చర్ చట్టము మరియు నిబంధనలలోని (7) నిబంధన ప్రకారం వ్యాపారస్తులుగా రిజిష్టర్ పొందియున్నట్టివారు మాత్రమే వోటు చేయుటకు అర్హులైయున్నారు. 24-2-1962 తరువాత రిజిష్టరీ చేయించుకొన్న వ్యాపారులు మార్కెట్‌లో వ్యాపారముచేసుకొనుటకు మాత్రమే అర్హులు. అయితే ఎన్నిక పోటీకిగాని, వోటు చేయుటకుగాని అర్హతలేదు.

అన్ని వర్గములకు సంబంధించిన చిన్న డీలర్లందరు ఎన్నికలో పాల్గొనుటకు వోటు చేయుటకు అర్హత గలిగియున్నారు.

ఓటర్ల జాబితాలను ఉస్మాన్‌గంజ్‌లోను హైద్రాబాద్ మార్కెట్ కమిటి కార్యాలయము మరియు సికింద్రాబాద్, చాంద్రాయణగుట్టలలోని సబ్-ఆఫీసులలోగల నోటీసు బోర్డులపై 26-2-62 వరకు వుంచబడును. ఏవయిన అభ్యంతరములు వుండే యెడల 1-3-62 సా॥ 3 గంటలవరకు తెలియజేయబడును.

మార్కెట్ కమిటి కార్యాలయంలో అందినట్టి అభ్యంతరముల పరిశీలించిన తరువాత వోటర్ల జాబితాను తుదిగా నిర్ణయించబడి 3-3-62కు మార్కెట్ కమిటి కార్యాలయములలోని నోటీసుబోర్డులపై వుంచబడును.

ప్రిన్సిపాల్ తరపున (7) నిబంధన ప్రకారం అగ్రిమెంటు నిర్వహించినట్టివారు శాశ్వత ఇతరులు ఎన్నికకు నిలబడుట లేక వోటుచేయుటకు అర్హులుకారు.

ఒకరు లేక ఎక్కువ మంది భాగస్వాములుగల సంస్థ విషయములో అట్టి ఫారంయొక్క భాగస్వాములలో ఎవరయిన ఎన్నికకు నిలబడవచ్చును లేక వోటు చేయవచ్చును.

ప్రతివోటుదారు ప్రతి సీటునుండి ఒక వ్యక్తిని ప్రతిపాదించు స్వేచ్ఛ గలదు. ప్రతినామినేషన్ వోటర్‌చే లిఖితపూర్వకముగా తయారుచేయవలసియుండును. బైలాస్ మంజూరీలో నిర్ణయించబడిన ఫారంలో ప్రతి నామినేషన్ వుండవలెను. మరియు నామినీయొక్క లిఖితపూర్వకమైన ధువపత్రము జతపరుచవలసియుండును.

నామినేషన్ పత్రములను కీ మార్కెట్ సూపరింటెండెంట్, హైద్రాబాద్, ఉస్మాన్‌గంజ్ అడ్రసుకు మూసివేయబడిన కవరులోగాని లేక నామినేషన్‌ను మూసివేయబడిన కవరులో రిజిష్టర్ పోస్టుద్వారా పంపుచు అట్టిదానిపై "హైద్రాబాద్ మార్కెట్ కమిటీ ఎన్నికకు నామినేషన్" అని పేర్కొనుచు అట్టి వాటిని 7-3-62 సా॥ 3-0 గం॥ లోపు అందునట్లు పంపించవలెను.

ఏ అభ్యర్థియైన తన అభ్యర్థిత్వమును ఉపసంహరించుకొనుటకు బైలాస్‌లో మంజూరయిన నిర్ణీతప్రాఫార్మాలో లిఖితపూర్వకమైన నోటీసును రిజిష్టర్ పోస్టుద్వారా కాని లేక వ్యక్తిగతముగాకాని కీ మార్కెట్ సూపరింటెండెంట్, హైద్రాబాద్ (ఉస్మాన్‌గంజ్) కు 11-3-62 ఉదయం 10-0 గం॥ లోపు అందజేయవలెను.

పేర్కొనబడిన మార్కెట్ కార్యాలయములో 12-3-1962 ఉదయం 10-0 నుండి 1-0 గం॥ మరియు సా॥ 2-0 నుండి 5-0 గం॥ మధ్యన పోలింగ్ జరుపబడును.

ఎన్నికల వేళల్లో వోటర్లగుర్తును పరిశీలించిన తరువాతనే చైర్మన్‌చే స్టాంపువేసి నెంబరు, సంతకము అయినతరువాత బైలాస్‌లో మంజూరయిన నిర్ణీత ప్రాఫార్మాపై బ్యాలెట్ పత్రములు వోటర్లకు యివ్వబడును.

వోటర్ల సమాచారమునకై సంబంధించిన నియోజకవర్గములలో వుంచబడిన జాబితాక్రయముప్రకారంగల వోటర్లు తమ క్రమసంఖ్య పేర్కొనుచు వారి ఇష్టానుసారము తమ వోట్లను వేయవచ్చును.

నిర్ణీతమైన అధికారులనుండి బ్యాలెట్ పత్రములు తీసుకొనే సమయమున వోటర్లు తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (లైసెన్సు) ఒరిజినల్ లేక సంస్థ అయ్యేయెడల ఒరిజినల్ లైసెన్సుతో అధికారపూర్వకమైన ఉత్తరమును అట్టిదానిపై నిర్ణీతాధికారి వోటు ఉపయోగించుకొనుటకు యివ్వబడే గుర్తును ఒరిజినల్ లైసెన్సుతో జతపరచి యివ్వవలెను.

అన్ని నియోజకవర్గములలోని బ్యాలెట్ పెట్టెలను వోట్లలెక్కించుటకు 12-3-62 తేది సా॥ 7-0 గం॥ హాజరయిన అభ్యర్థులు లేక వారి అధికారికమైన ఏజంట్లసమక్షమున మార్కెట్‌కమిటీ కార్యాలయం, హైద్రాబాద్ ఉస్మాన్‌గంజ్‌లో కమిటి చైర్మన్‌చే తెరువబడును.

ఎక్కువసంఖ్య వోట్లు సంపాదించుకున్న అభ్యర్థులు ఎన్నికైనట్లు తీర్మానించబడును.

ఏ నియోజకవర్గములోనైన సమానమైన సంఖ్యలో వోట్లు వచ్చే యెడల అట్టిదానివిషయములో మార్కెట్ కమిటి చైర్మన్ లాట్లు డ్రా ద్వారా పరిష్కరించి లెక్కించుట పూర్తయినవెంటనే హాజరయిన అభ్యర్థుల సమక్షములో మొత్తము (8) ఆరుసీట్లకు గెలుపొందిన అభ్యర్థుల పేర్లను నోటీసుబోర్డులమీద ప్రకటించబడును.

వ్యాపారస్తుల ఎన్నికవిషయములో ఏవయిన అప్పీళ్ళువుండేయెడల అట్టివాటిని ఎన్నికయిన తేదీనుండి 10 రోజులలోపు మార్కెట్ కమిటి చైర్మన్‌కు అందజేయవలెను.

చైర్మన్, మార్కెట్ కమిటీ హైద్రాబాద్.

6 వ వారం!
భాస్కర్ ప్రొడక్షన్స్ వారి
మోహినీ రుక్మాంగద
(ఏకాదశి మహాత్మ్యం)
మనోహర్ - సికింద్రాబాద్
జగత్ - సైదాబాద్
ఆటలు: 6-00, 9-30.
—ఈస్టిండియా రిలీజ్.

2 వ వారము
ఫిబ్రవరి 12,13,14,15 తేదీలు
మ॥ 2-30 గం॥
ప్రత్యేక మ్యాటినీలు
రేచుక్క పగటిచుక్క
తా: ఎన్. టి. రామారావు, జానకి, రేలంగి. ఎస్. వి. రంగారావు.
కమల్ టాకీస్
చాదర్‌ఘాట్
Nima.

Edited Printed and Published by N. Narotham Reddy M. A for the Golkonda Publications Ltd Golkonda Printing press Hyderabad A.P

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పరిశ్రమలనుగురించి సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టరు ఏర్పాటుచేసిన ఒకప్రదర్శనాన్ని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ శ్రీ డి. ఎస్. రెడ్డి 10 వ తేదీన ప్రారంభించారు.

నగర వార్త

"త్యాగరాజ ఆరాధనోత్సవం"

నవ్యాంధ్ర కళాకేంద్రం (సికింద్రాబాదు) ఆధ్వర్యాన శనివారం 10-2-1962 తేదీ సాయంకాలం 6 గంటలకు కార్యాలయ ఆవరణలో "త్యాగరాజ ఆరాధనోత్సవం" శ్రీ ఎ. వి. దీక్షితులుగారి అధ్యక్షతన జరుపబడెను.

సంస్థ ప్రధాన కార్యదర్శి, శ్రీ ఎం. వి. యన్. చలపతిరావు సదస్యులను ఆహ్వానించిరి.

శ్రీ వి. యన్, శర్మగారు ఇలా ఉపన్యసించిరి. "త్యాగరాజు కారణజన్ముడు. సాహిత్యాన్ని, భక్తిని, సంగీతంతో మేళవింపజేసిన మహా మహిమాన్వితుడు, నభూతో నభవిష్యతి."

శ్రీమతి పి. లలిత త్యాగరాజ కృతులను కర్ణశ్రావ్యంగా, భక్తిరస పూరితముగా గానం చేశారు. అంతకు ముందు వేదోక్తముగా త్యాగరాజ మహర్షికి పూజలుపజరెడెను. సదస్సులకు ప్రసాదము పంచబడెను.

ప్రధాన కార్యదర్శి వందనసమర్పణతో నాటి కార్యక్రమము విజయవంతముగా ముగిసెను.

ఆల్ సెయింట్స్ వయోజన రాత్రి పాఠశాల పాలకవర్గం

ఆల్ సెయింట్సు వయోజన రాత్రి పాఠశాల ద్వైవార్షిక ఎన్నికలు యీ నెల 8న జరిగినవి. ఈక్రిందివారు పాఠశాల పాలకవర్గానికి యెన్నికయినారు: అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీ ఎం. ఏ సత్తార్. శ్రీ టి. విఠల్ సింగ్ ప్రధాన సంయుక్త కార్యదర్శులు శ్రీ యం ఏ. రజాక్, శ్రీ యం. ఏ. ఖుద్దూస్.

సచ్చాపూర్‌లో దోపిడి

హైద్రాబాదు, ఫిబ్ర 10

గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఈనెల మొదటి తేదీన జహీరాబాదు తాలూకాలోని సచ్చాపూర్ గ్రామనివాసి శ్రీ అంజిరెడ్డి ఇంట్లో దోపిడి చేసినట్లు ఇక్కడి కందిన వార్తలవల్ల తెలుస్తున్నది.

ఈ దోపిడీ దొంగలు ఇంట్లో వారిని ఎదిరించి 4 వేల విలువగల నగలను మరియు ఇతర సామగ్రిని దోచుకొన్నారు.

ఈ వార్త అందగానే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ రషీద్ అహమద్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నరేశ్ కుమార్ మరియు సంగారెడ్డి డి. ఎస్. పి శ్రీ మొహియొద్దీన్ దోపిడిజరిగినచోటుకు వెళ్ళి విచారణ జరిపారు.

మెట్‌పల్లిలో ఖాదీపరిశ్రమల ఎగ్జిబిషన్

జనవరి 23నుంచి ఫిబ్రవరి 9వరకు నిర్వహణ

కరీంనగర్, ఫిబ్రవరి 11

ఈ జిల్లాలోని మెట్‌పల్లిలో గత 26వ తేదీనుంచి యీనెల 9వ తేదీ వరకుఖాదీవ్యవసాయగ్రామపరిశ్రమల వస్తుప్రదర్శనం నిర్వహించ బడినది. పరిసర తాలూకా గ్రామాలలో నివసించే ప్రజలు రోజూ (సుమారు 15 వేలమంది) యీ ప్రదర్శనానికి వచ్చి యిక్కడవుంచిన వస్తుసముదాయాన్ని ఆసక్తితో తిలకించారు. ఈ ప్రదర్శనాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ సయ్యద్ నూరుల్ హసన్ జాఫ్రీ మొదటి రోజున సందర్శించి యీ సందర్భంలో జరిగిన సభలో ప్రసంగించారు.

స్థానిక ఖాదీ కార్యాలయ ఆర్గనైజర్ శ్రీ జి బలరామమూర్తి అతిథికి స్వాగతం చెప్పారు. ఎగ్జిబిషన్ కమిటీ తరపున శ్రీ బి. వీరకుమార్ వందనసమర్పణ చేశారు. జిల్లాకలెక్టర్ మెట్‌పల్లిలో యేర్పాటుచేసిన యీ ప్రదర్శనలో చిన్న మొత్తాల పొదుపు ఉద్యమాన్ని గురించి వివరించగా రూ- 5 వందలు విలువగల బహుమతి బాండ్లు అమ్ముడు పోయాయి.

ప్రపంచ వైజ్ఞానికసంస్థ అసిస్టెంట్ డైరెక్టరు జనరల్

శ్రీ ఎమ్. ఎస్. ఆదిశేషయ్య నేడే ఢిల్లీకి రాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11

ప్రపంచ వైజ్ఞానిక సంస్థ అసిస్టెంటు డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాల్కోమ్ ఎస్. ఆదిశేషయ్య అధికార కార్యకలాపాల నిమిత్తం ఫిబ్రవరి 12 వ తేదీన ఢిల్లీ వస్తారు. ఆయన క్కడ రెండు రోజుల పాటు ఉంటారు. భారతదేశంలో ప్రపంచ వైజ్ఞానికసంస్థ తరపున జరిగిన కార్యక్రమాలఅభివృద్ధి విషయమై భారతీయ అధికారులతో కలిసి సమీక్షిస్తారు. 1963 - 64 సంవత్సరపు కార్యక్రమం క్రింద అభివృద్ధి కార్యకలాపాలను గురించి కూడా ఆయన చర్చిస్తారు.

ఆయన ఢిల్లీలో వుండే రెండు రోజులలో భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్‌ను కలుసుకొంటారు. ఆసియాలో విద్యా ప్రణాళికా రచయితలు పరిపాలకులు ఉద్యోగులు పర్యవేక్షకులకు శిక్షణఇచ్చే ఒక ప్రాంతీయ కేంద్రాన్ని న్యూఢిల్లీలో నెలకొల్పే నిమిత్తం ఒక ఒప్పందముపై అంతర్జాతీయ వైజ్ఞానిక సంస్థ తరపున శ్రీ ఆదిశేషయ్య సంతకం చేస్తారు.

ప్రస్తుతం విజ్ఞానభవనములో జరుగుతున్న ఆసియాలో విద్యా ప్రణాళికా రచనపై ప్రపంచ వైజ్ఞానిక సంస్థ ప్రాంతీయ గోష్ఠిలో ఆయన ప్రసంగిస్తారు. ఆయన ఇతర అనేక మందితో పాటు ప్రణాళికా సంఘానికి, ప్రపంచ వైజ్ఞానిక సంస్థ ప్రాంతీయ కార్యాలయానికి చెందిన అధికారులతోను, కేంద్రవిద్యా శాస్త్ర పరిశోధన సాంస్కృతిక వ్యవహారాలు, రేడియో సమాచారము మొదలయిన మంత్రిత్వశాఖలకుచెందిన అధికారులతోనూ, విశ్వ విద్యాలయ గ్రాంటుల్లసంఘం అధ్యక్షులతోనుచర్చలు కొనసాగిస్తారు.

శ్రీ ఆదిశేషయ్య ఫిబ్రవరి 14 వ తేదీన బొంబాయిలో సాంకేతిక సంస్థను సందర్శిస్తారు.

సహకార సంఘాలచే వాడకందార్ల సరుకుల దిగుమతి

లైసెన్సింగు నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11

వాడకందార్ల సహకార సంఘాలు వాడకందార్ల సరుకుల దిగుమతికి సంబంధించిన నిబంధనలు సడలించారు. ఆ సంఘాల కవసరమైన సరుకుల దిగుమతికి లైసెన్సులు పొందడములోజరుగుతున్న ఇబ్బందుల దృష్ట్యా పై చర్య తీసుకున్నారు.

హెచ్చుమంది సభ్యులు లేక హెచ్చు వ్యాపారముగల వాడకందార్ల సహకార సంఘాలకూ, ఎక్సు సంఘాలకు దిగుమతి లైసెన్సుల విషయంలో వెయిటేజీఇస్తారు. దిగుమతి లైసెన్సుల మంజూరికి వాడకందార్ల సహకార సంఘాల వ్యవహరణ గడువు 3 ఏళ్ళ నుంచి రెండేళ్ళకు తగ్గించారు.

వాడకందార్ల సహకార సంఘాలు విడివిడి సరుకుల దిగుమతికి ప్రత్యేక లైసెన్సుల కోసము దరఖాస్తులువంపుకోవచ్చును. వాడకందార్ల సహకార సంఘాలకు మంజూరు చేసిన లైసెన్సులు భారతదేశములోని ఏ రేవు ద్వారా అయినా సరుకులను దిగుమతి చేసుకోడానికి పనికివస్తాయి. ఆరీత్యా ఆసహకార సంఘాలు తమకు చేరువలోని రేవులద్వారా సరుకులను దిగుమతి చేసుకోవచ్చును.

జాతీయ సహకార అభివృద్ధి, గిడ్డంగులబోర్డు ఇతర సిఫార్సులతోపాటు వాడకందార్ల సహకార సంఘాలకు దిగుమతి లైసెన్సుల విషయములో ప్రాధాన్యము ఇవ్వాలని సిఫార్సు చేసింది.

ఇటలీలో నూతన ప్రభుత్వ యేర్పాటుకు అమింటోరెఫాన్ ఆనికి అధికారం

రోమ్, ఫిబ్రవరి 11

ఇటలీ ప్రధానిగా పదవీ విరమణ చేయనున్న అమింటో రెఫాన్ ఆనిని తిరిగి ఇటలీ నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రెసిడెంట్ గియోవాన్ని గ్రోంచి నిన్న అధికారిత్వా బాధ్యత నప్పగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో పరాకాష్ఠనందు కొంటున్న ఎన్నికల ప్రచారం

ప్రతి పట్టణంలో గ్రామంలో ఎన్నికలసభలు ఊరేగింపులు

హైద్రాబాద్, ఫిబ్రవరి 11

ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ప్రారంభం కావడానికి ఇంకా 8 రోజుల వ్యవధి మాత్రమే ఉన్నది. జిల్లా ప్రధాన కేంద్రాలు పట్టణాలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం అప్పుడే ఉద్ధృత స్థాయిని అందుకున్నది.

ఎన్నికల సమావేశాలు, ఇంటింటికి వెళ్లి పోటీచేస్తున్న అభ్యర్థులకు ఓట్లు ఇమ్మని ప్రచారం చేసుకోవడం గడచిన నాలుగు అయిదు రోజుల నుండి ప్రారంభమైంది. పార్టీల పతాకాలుచేత ధరించి వివిధ నినాదాలుచేస్తూ కార్యకర్తల బృందాలు సైకిళ్లపై ఊరేగింపులు జరుపుతున్నాయి. బజారు కూడలులు దేవాలయాలు పాఠశాల స్థలాలు మున్సిపాలిటీ ఆఫీసులు పంచాయత్ ఘర్‌లవద్ద ఎన్నికలలో పోటీ చేసేఅభ్యర్థులపోస్టర్లు కాన్పిస్తున్నాయి. విస్తృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పూర్తి రాష్ట్రంలో తొలిమారుగా జరుగుతున్న ఎన్నికలు ఇవే ఐనందున వీనికి విశేష ప్రాధాన్యము ఉన్నది.

1952 ఎన్నికల సమయంలో ఆంధ్ర ప్రాంతం మద్రాస్ రాష్ట్రంలోను తెలంగాణా హైద్రాబాద్ రాష్ట్రంలోను ఉన్నవి. 1955లో మధ్యాంతర ఎన్నికలు ఒక్క ఆంధ్ర ప్రాంతంలోనే జరిగాయి. 1957 జనరల్ ఎన్నికల సమయమందు అందువల్ల ఆంధ్రప్రాంతంలో ఎన్నికలు జరుగలేదు. తెలంగాణాలో మాత్రమే జరిగాయి. ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల రంగంలో ఉన్న ప్రధాన పక్షాలు కాంగ్రెసు కమ్యూనిస్టులు స్వతంత్రపార్టీ. ఇప్పటి అసెంబ్లీ 300 స్థానాలలో కాంగ్రెసు 240 సంఖ్యాబలాన్ని కలిగి ఉన్నది. కాంగ్రెసు అసెంబ్లీ అన్ని స్థానాలకు పోటీచేస్తున్నది ఈ రాష్ట్రము లో. కమ్యూనిస్టులు135స్థానాలకు స్వతంత్ర పార్టీ 140 స్థానాలకు పోటీచేస్తున్నది, జనసంఘం 70 స్థానాలకు రిపబ్లికన్ పార్టీ 18 స్థానాలకు సోషలిస్టులు 15 స్థానాలకు పి. ఎస్. పి. 8 స్థానాలకు పోటీ చేస్తున్నారు. వీరుకాక ఏపార్టీకి చెందనివారు 302 మంది ఎన్నికల రంగములో ఉన్నారు.

కమ్యూనిస్టుపార్టీ ప్రచారానికై ఖూవేవ్‌గుప్త ఇప్పుడు ఆంధ్రలో పర్యటిస్తున్నాడు. స్వతంత్ర పార్టీ నాయకుడు సి. రాజగోపాలాచారి నెల్లూరు, కావలి, తెనాలి పట్టణములందు ప్రసంగించారు.

కాంగ్రెసు ఎన్నికల ప్రచారానికై ఆంధ్రప్రదేశ్‌లో రెండు రోజులు ప్రధాని నెహ్రూ పర్యటించారు. కేంద్ర ఆర్థికమంత్రి మురార్జీదేశాయి హైద్రాబాదు నగరములో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి ఇదివరకే ప్రారంభోత్సవము చేశారు. యు. యన్. ధేబర్, ఇందిరాగాంధి, ఎస్. కె. పాటిల్ ఈ రాష్ట్రానికి వచ్చి కాంగ్రెసు ఎన్నికల ప్రచారాన్ని ఉద్ధృతంగా నిర్వహించారు. జనసంఘ ప్రచారముగూడా కొనసాగుతూనే ఉన్నది.

స్వతంత్ర పార్టికిచ్చే ఓట్లు పెన్నానది పాలుచేయుటమే

నెల్లూరు సభలో ముఖ్యమంత్రి హెచ్చరిక

నెల్లూరు, ఫిబ్ర 11

కాంగ్రెస్ యాజమాన్యాన నిన్న యిక్కడ జరిగిన బహిరంగసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య తమ ప్రసంగంలో ఓటరు-అభ్యర్థి మధ్య ఉండే సంబంధాలను మామ-అల్లుడు చుట్టరికంతో పోల్చి ఓటరు-అభ్యర్థి బాంధవ్యాన్ని యిలా నిర్వచించారు.

ఓటరు-అభ్యర్థి బాంధవ్యం

"ఆడపిల్లను కన్నతండ్రి తన బిడ్డ సుఖపడాలన్న అభిలాషతో శ్రమపడి అన్ని అర్హతలవున్న వరుని ఏరుకోవడంకద్దు. ఓటుపన్న ప్రతి వ్యక్తి ఆడపిల్లవున్న తండ్రితో సమానం. కూతురును ఉత్తమ లక్షణాలు కలిగిన యోగ్యునికి కట్టబెట్టినట్లుగానే ఓటు వున్న ప్రతి వ్యక్తి అర్హత కలిగిన మంచి అభ్యర్థికి యెన్నికలలో ఓటు చేయటమవసరం"-

ఎన్. జి. ఓ. లకు గ్రామోద్యోగులకు సలహా

ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, యింకా మాట్లాడుతూ గ్రామోద్యోగులు ఎన్. జి. ఓ. లు ఎన్నికల సమయంలో ఆందోళనను ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయాన్ని గురించి ప్రస్తావించి వారు యిలాంటి చర్యకు పూనుకోవటం బాగా లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యెన్నికల అనంతరం యీ సమస్యలను సంప్రదింపులద్వారా రాజీమార్గాన పరిష్కరించటం మంచిదని ఆయన సలహా యిచ్చారు. స్వతంత్ర పార్టీ అనుసరిస్తున్న విధానాన్ని పేర్కొని స్వతంత్ర పార్టీవారు, ప్రణాళికా పథకాల అమలును రద్దుపరిచి పెట్టుబడి దారి విధానం పునరావృత్తం చేయటానికి పూనుకొన్నారన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వెల్లడించారు.

ఎన్నికలలో స్వతంత్ర పార్టీ అభ్యర్థులకు ఓటు చేయటమంటే వాటిని వెల్లూరు దాపులో ప్రవహించే పెన్నానది పాలుచేయటమన్నది ప్రతి ఓటరు గుర్తించాలని ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య సభలో హెచ్చరిక చేశారు.

ఎన్నికలలో కాంగ్రెసుకే ఓటు చేయండి

తెలంగాణా వెనుకబడ్డ తరగతుల కాంగ్రెస్ విజ్ఞప్తి

హైద్రాబాదు, ఫిబ్రవరి 11

జనరల్ ఎన్నికలలో కాంగ్రెసు అభ్యర్థులకు ఓటు చేయవలసిందని వెనుకబడ్డ తరగతులకు చెందినవారికి తెలంగాణా వెనుకబడ్డ తరగతుల కాంగ్రెసు కార్యవర్గం విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం చేసింది. తెలంగాణా వెనుకబడ్డ తరగతుల కాంగ్రెసు కార్యవర్గ సమావేశం నిన్న గాంధీభవన్‌లో శ్రీ కాటం లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. గిత కార్మికులకు ప్రత్యామ్నాయ వృత్తులు ముందు కల్పించి, తెలంగాణా ప్రాంతంలో మద్యనిషేధము అమలుపరచ వలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానం చేయబడినది.

మిర్యాలగూడలో శ్రీ సుందరయ్య జీపుపై దాడి

హైద్రాబాదు, ఫిబ్ర 11

ఈమధ్య రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆమోదించిన దళసూత్ర ఎన్నికల నిబంధనావళిని అనుసరించుకన్నా ఉల్లంఘించుట జరుగుచున్నదని కమ్యూనిస్టు నాయకుడు శ్రీ పి. సుందరయ్య నిన్న విలేఖరులగోష్ఠిలో ఆరోపించారు.

శ్రీ సుందరయ్య నల్గొండ జిల్లా మిర్యాలగూడ పర్యటనానంతరము నిన్ననే యిచటికి తిరిగి వచ్చారు. ఆ క్రితం రాత్రి మిర్యాలగూడలో సమావేశస్థలం నుండి తమ పార్టీకార్యాలయానికి జీపులో తిరిగి వెళుచుండగా జీపుపై రాళ్ళతో దాడి జరిగిందని, తత్ఫలితముగా 20 మందికి గాయాలు తగిలాయని. గాయపడిన వారిలో ఒక కాంగ్రెసువ్యక్తికూడ ఉన్నాడని శ్రీ సుందరయ్య అన్నారు.

తమపై దాడి జరుగుతుందనే అనుమానముతో ముందుగానే పోలీసు వారికి కబురు చేసినందున సమావేశస్థలిలో రిజర్వుపోలీసు వుంచబడిందని వారు దాడిని నిరోధించ లేక పోయారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భమున శ్రీ సుందరయ్య పోలీసు పక్షపాత వైఖరి ననుసరిస్తున్నదని ఆరోపించారు

—...

శ్రీ పి. వి. బి. కృష్ణారావు లండన్, ఫిబ్రవరి 11

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యుచ్ఛక్తి శాఖలో డివిజనల్ ఇంజనీరు శ్రీ పి. వి. బి. కృష్ణారావు కొలంబో ప్రణాళిక సౌకర్యముతో ఇప్పుడు బ్రిటన్‌లో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, అభివృద్ధి పథకాలతీరును పరిశీలించుతున్నారు. కిందటి సెప్టెంబరులో లండన్‌కు వెళ్ళారు. "లోడ్ కంట్రోల్ పద్ధతి" తనకు చాలా నచ్చినదన్నారు. భారత దేశములో యీపద్ధతి చాలా ఉపయోగపడే అవకాశం కలదన్నారు.

4 వ సంయుక్త వారం
గణేశ్ ప్రసాద్ మూవీస్ వారి
ఖడ్గ వీరుడు

దర్శకుడు:
టి. ఆర్. రఘునాథ్
తా: శివాజీగణేశన్, జమున.
రహత్ మహల్
ముషీరాబాద్, హైద్రాబాద్
రీగల్ సినీమా
ఖైరతాబాద్, హైద్రాబాద్
ఆటలు: 2-30, 6-15, 9-30.
—శ్రీ ఫిలిమ్స్ విడుదల.

లారీ- జీప్‌కారు ప్రమాదాలు

ఇద్దరి మృతి,పలువురికి గాయాలు

నిజామాబాద్, ఫిబ్రవరి 11

ఈ నెల 9వ తేదీన యెల్లారెడ్డి సమీపంలో ఒక లారీ ప్రమాదానికి గురై ఒకరు మరణించారు. నలుగురికి తీవ్రమైన గాయాలు తగిలాయి. వీరు హైద్రాబాద్‌కు చికిత్సకై పంపబడినారు. ఈ లారీ ప్రమాదంలో చిక్కుకొని గాయాలుపడిన మరో 10మంది యెల్లారెడ్డి ఆస్పత్రిలో చేర్చబడినారు.

జీపు ప్రమాదం

డిచ్‌పల్లి సమీపంలో కామారెడ్డి మలేరియా ఆఫీసర్ శ్రీ భుజంగరావు జీప్ ప్రమాదానికి లోనయి మరణించాడు. ఈ జీప్ కారులో ప్రయాణిస్తున్న అకౌంటెంట్‌కు గాయాలు తగిలాయి.

కామారెడ్డి తాలూకాలోని ఈసాయిపేట గ్రామంలో హరిజనుడు రాజయ్య శవం దొరికింది. ఈతనిని హత్య చేశారని భావింపబడుతున్నది. పోలీసులు యీ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

—

కాంగ్రెస్‌వాదులు, అకాలీలమధ్య ఘర్షణ

ఒకనికి బలమైన గాయాలు

అంబాలా, ఫిబ్రవరి 11

మోరిందా అసెంబ్లీ రిజర్వు నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ మరియు అకాలీదళ్ అభ్యర్థుల అనుయాయులు రూపార్ సబ్ డివిజన్ లోని ఝులియన్ కలాన్ గ్రామంలో ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా ఒక కాంగ్రెస్ వాదికి బలమైన గాయాలు తగిలి సివిల్ డిస్పెన్సరీలో చేర్చబడినాడు.

పోలీసులు యీ ఘర్షణను పురస్కరించుకొని గ్రామ సర్పంచ్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేశారు.

ద్వాదశాంధ్రాభ్యుదయ ఉత్సవములు

హైద్రాబాదు, ఫిబ్రవరి 11

ఉస్మానియా అఖిల కళాశాలల ఆంధ్ర విద్యార్థి సమష్టి సంఘము పక్షమున ఫిబ్రవరి 12 మరియు 13 తేదీలలో ఎగ్జిబిషన్ థియేటరులో పై ఉత్సవములు జరుగుతాయి. వాని కార్యక్రమ వివరాలు ఇవి:-

12-2-1962 సోమవారము సాయంత్రం 5 గంటలకు ప్రార్థన: ఆర్. జ్యోతిర్మయి, కె. ప్రమీల పరిచయము: పి. వి. రంగారావు, స్వాగతోపన్యాసము: శ్రీ వి. రామరాజుగారు, అధ్యక్షోపన్యాసము: శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు. సాహిత్యోపన్యాసము: శ్రీ దాశరథిగారు.

వినోద కార్యక్రమము: గీతావళి వి- టి. ఏ. రామాచారి, విముక్తుడు (నాటిక): న్యూ సైన్స్ కళాశాల, గీతావళి: పి-నారాయణరెడ్డి, జారాబలం (నాటిక): వేదాంత వర్ధిని కళాశాల, నృత్యము:కుమారి పి విద్యాధరి వాపసిచ్చిన వరకట్నం(నాటిక) బ్రదూకా (సాయం) కళాశాల. గీతావళి: ఎమ్. పద్మజ. ఎవరో పిలిచారు (నాటిక) న్యాయ(సాయం) కళాశాల.

13-2-1962 మంగళవారము సాయంత్రం 5 గంటలకు:- అధ్యక్షోపన్యాసము: బి. సత్యనారాయణరెడ్డి. సాహిత్యోపన్యాసము: ఆచార్యశ్రీ వి. వి. రామనాథంగారు.

వినోద కార్యక్రమము: గీతావళి నరసింహాచార్యులు.సమర్పణ(నాటిక) వివేకవర్ధిని కళాశాల. గీతావళి: ఆర్. జ్యోతిర్మయి. నా బాబు (నాటిక): నిజాం కళాశాల. తట్టా: జి. సుబ్బారావు. మాండలిన్: పిలిప్పి కృపాసాగర్, అల్లూరి సీతారామరాజు. ఆయుర్వేద కళాశాల. వినోద కథ: ఆర్. జ్యోతిర్మయి, యమ్. వి. రమణ, పరివర్తన (నాటిక): బ్రదూకా కళాశాల.

బహుమతుల ప్రదానము:-

కృతజ్ఞతలు: కుమారి కె. జయలక్ష్మి.

రెమీ ఇంక్
ఉచిత బహుమతి
ఫలితాలు

ప్రథమ బహుమతి	నెం.	6 24
రెండవ ,,	నెం	4160
మూడవ ,,	నెం.	9300
4 వ